ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 17 ఫిబ్రవరి 2024

ఆరోగ్యశ్రీ కార్డులు త్వరగా పంపిణీ చేయాలి : కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. అన్నమయ్య కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశ కార్యక్రమాలను మరింత పటిష్టవంతంగా నిర్వహించి ప్రతిఒక్కరికీ వైద్య సేవలందేలా చూడాలన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ఓపీ సంఖ్యను పెంచాలన్నారు. కంటి వెలుగు పథకంలో భాగంగా రెఫరల్ చేయబడిన వారికి అద్దాల పంపిణీ వందశాతం పూర్తి చేయాలన్నారు. నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, జిల్లాలో టాస్క్‌ఫోర్స్ కమిటీ మీటింగ్ చేయాలని తెలిపారు. రెవెన్యూ అంశంలో భాగంగా చుక్కల భూములు, ఇనాం భూములను మార్గదర్శకాల మేరకు పరిష్కరించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అధికారంలోకి టీడీపీ-జనసేన

- ప్రజలందరికీ మంచి రోజులు రానున్నాయి
- తుంగా రమణయ్య జన్మదిన వేడుకలలో నేతలు


తుంగా రమణయ్యను సన్మానిస్తున్న మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 16: రాష్ట్రంలో ఐదేళ్లుగా సాగుతున్న వైసీపీ అరాచకపాలనకు ప్రజలు చరమగీతం పలకనున్నారని, త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ-జనసేన పార్టీల సారధ్యంలో ప్రభుత్వం ఏర్పాటు కానుందని పలువురు టీడీపీ, జనసేన నేతలు పేర్కొన్నారు. ఇటీవల జనసేన పార్టీలో చేరిన ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి, విశ్వప్రగతి చిట్‌ఫండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ తుంగా రమణయ్య మిత్ర బృందం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వైఎస్సార్ ఆడిటోరియంలో జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీమంత్రి, టీడీపీ నేత కన్నా లక్ష్మీనారాయణ, పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్, జిల్లా ప్రధానకార్యదర్శి వికాస్ హరికృష్ణ, జనసేన పార్టీ రాజంపేట నియోజకవర్గం ఇన్‌చార్జ్ మలిశెట్టి వెంకటరమణ తదితరులు హాజరయ్యారు. వీరు మాట్లాడుతూ రాజకీయరంగంలోకి తుంగా రమణయ్య ప్రజల ఆశీర్వాద బలంతో, మిత్రుల సహకారంతో రాజకీయరంగానికే వన్నెతెచ్చేలా మచ్చలేని నాయకుడిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తుంగా రమణయ్య మాట్లాడుతూ మెగాస్టార్ ఫ్యామిలీ అంటే తనకు ప్రాణమని, అందుకే జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నానని అన్నారు. వైసీపీ పాలనలో సాగుతున్న అరాచకాలను నిగ్గదీసి అడుగుతున్న పవన్‌కళ్యాణ్ కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధమన్నారు. కార్యక్రమంలో జనసేన రాయలసీమ జోన్-1 కోకన్వీనర్ పంద్ర రంజిత్‌కుమార్, రాజంపేట జనసేన నాయకులు ఎలక్ట్రికల్ శ్రీనివాసరాజు, నగర అధ్యక్షుడు మాలె శివ, రాజ్ ఇంటీరియర్స్ అధినేత కె.రాజేశ్‌కుమార్, శ్రీహరి ఐరన్‌మార్ట్ అధినేత వడ్ల శ్రీనివాస్, రామ్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత నరసింహులు, రియల్టర్ జల్లా సుబ్రమణ్యం, విశ్వప్రగతి చిట్‌ఫండ్స్ డైరెక్టర్ తుంగా వెంకటేశ్, తుంగా కిరణ్, శ్రీనివాస రెసిడెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ బీవీ సుమన్, చైర్మన్ బి.శ్రీనివాసులు, శంకరాపురం సుబ్బారావు, టింబర్ గోపి, టింబర్ సుబ్బయ్య, డైమండ్ బాలకృష్ణ, అంజి, హర్షవర్ధన్, అమరప్ప లెవన్‌నాట్‌ఫోర్ రమణ, తోట సుమన్, న్యాయవాది గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.


తుంగా రమణయ్యను సన్మానిస్తున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తదితరులు

అంతా.. మా ఇష్టం..!

- ఇష్టానుసారంగా ముంబై - చెన్నై జాతీయ రహదారి విస్తరణ పనులు
- దుమ్ము, ధూళితో ములకలచెరువు వాసులకు చుక్కలు
- పెరిగిన మాస్కుల వినియోగం
- రోడ్డు పొడవునా పేరుకుపోయిన మట్టి
- ఇళ్లల్లోకి వెళ్లేందుకు వీలు లేకుండా తవ్వకాలు

ముంబై- చెన్నై జాతీయ రహదారి విస్తరణ పనులు ములకలచెరువు వాసులకు చుక్కలు చూపిస్తున్నాయి. అంతా మా ఇష్టం.. అనే రీతిలో పనులు సాగుతుండడంతో ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతం. రోడ్డును ఎక్కడపడితే అక్కడ తవ్వేసి కాలువలు తీస్తుండడంతో మట్టి రోడ్డుపైకి భారీగా చేరి రోడ్డు కనిపించకుండా పోయింది. ఫలితంగా ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఇక రోడ్డు కిరువైపులా ఉన్న దుకాణదారుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. దుమ్ము, ధూళితో అగచాట్లు పడుతున్నారు. అలాగే ఈ రహదారి విస్తరణ పనులతో తాగునీటి పైపులైను కనెక్షన్లు దెబ్బతినడంతో ములకలచెరువులో తాగునీటి సమస్య ఉత్పన్నమైంది. ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.


ములకలచెరువులో జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులు


కదిరి రోడ్డు, బస్టాండు సర్కిల్‌లో వాహనాలు వెళ్లే సమయంలో కమ్ముకున్న దుమ్ము

ములకలచెరువు, ఫిబ్రవరి 16: ములకలచెరువు నుంచి మదనపల్లె వరకు ఉన్న 43 కి.మీ. ముంబై - చెన్నై జాతీయ రహదారి (ఎన్‌హెచ్-42) విస్తరణ పనులకు కేంద్రం ప్రభుత్వం 2021 డిసెంబరులో రూ.480.10 కోట్లు మంజూరు చేసింది. దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియ తదితర పనులు పూర్తయి 2022 డిసెంబరు నెలలో పనులు ప్రారంభమయ్యాయి. అప్పట్లో శ్రీ సత్యసాయి - అన్నమయ్య జిల్లా సరిహద్దులో ఈ పనులను ప్రారంభించారు. ఈ క్రమంలో ములకలచెరువును వదిలి మిగిలిన మదనపల్లె వరకు పనులు ప్రారంభించడంతో తుది దశకు చేరుకున్నాయి. చివరగా ములకలచెరువులో పనులు మొదలుపెట్టారు. 2023 డిసెంబరు చివర్లో ఇక్కడ పనులు ప్రారంభించారు. సుమారు రెండు కి.మీ. రోడ్డు విస్తరణ, ఇరువైపులా మురికినీటి కాలువల నిర్మాణం, రెండు మోరీల పనులు చేపట్టారు. తొలుత రోడ్డు కిరువైపులా మురికి నీటి కాలువ నిర్మించేందుకు యంత్రాల సహాయంతో మట్టిని తీశారు. పనులు ఒక వైపు నుంచి ప్రారంభించకుండా రెండు కి.మీ.లో రెండు వైపులా నుంచి ఎక్కడ పడితే అక్కడ కాలువలు నిర్మించేందుకు మట్టిని తీశారు. మదనపల్లె, కదిరి రోడ్డు చివర్లో కొత్త రోడ్డు వేసేందుకు పాత తారును తొలగించారు. కదిరి రోడ్డులో రోడ్డు తవ్వేసి 15 రోజులకు పైగా అవుతున్నా అతీగతి లేదు. మదనపల్లె రోడ్డులో రోడ్డు తొలగించి కంకర పరిచారు. ఈ పనులు పూర్తి చేయకనే తాజాగా కెనరా బ్యాంకు ఏటీఎం దగ్గర నుంచి పోలీస్‌స్టేషన్ వరకు పాత తారును తొలగించారు.

అలాగే బంగ్లా, ఆర్టీసీ బస్టాండుల వద్ద నున్న మోరీలను ఓ వైపున తీసేశారు. ఆర్టీసీ బస్టాండు వద్దనున్న మోరీ పనులు మాత్రం చేస్తున్నారు. మురికినీటి కాలువలను క్రమబద్ధంగా కాకుండా ఎక్కడ పడితే అక్కడ మట్టిని తీసి పొడువునా గుంతలను తీసి వదిలేశారు. అక్కడక్కడ కాలువ నిర్మిస్తూ వస్తున్నారు. కాలువల నిర్మాణం, కొత్త రోడ్డు వేసేందుకు తీసేసిన రోడ్డు కారణంగా మట్టి పెద్ద ఎత్తున రోడ్డుపైకి చేరింది. దీంతో నిత్యం వాహనాలు రాకపోకలు సాగించే ఈ రోడ్డులో మట్టి కారణంగా లేస్తున్న దుమ్ము, ధూళి కారణంగా స్థానికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులైతే ముక్కుమూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. రెండు కి.మీ. పొడువునా ఉన్న దుకాణదారులైతే ప్రతి రోజు నరకాన్ని చూస్తున్నారు. మాస్కులు ధరించి దుకాణాల్లో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. నామమాత్రంగా ఉదయం, సాయంత్రం మాత్రం రోడ్డు తవ్విన ప్రాంతంలో మాత్రమే ట్యాంకర్లతో నీరు పట్టి మిగిలిన చోట్ల అలాగే వదిలేస్తున్నారు. దీంతో నీళ్ల పడుతూ చేతులు దులుపుకుంటున్నారు. అక్కడక్కడ ట్యాంకర్‌తో నీరు పడుతున్నా ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో కొద్దిసేపటికే ఎండిపోతోంది.

తాగునీటి సమస్యతో ఇక్కట్లు

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకిరువైపులా మురికినీటి కాలువల నిర్మాణానికి గుంతలు తీయడంతో భూమిలో ఉన్న తాగునీటి పైప్ లైన్లు పగిలిపోయాయి. దీంతో తాగునీటి కుళాయిల్లో చుక్క నీరు రాక ములకలచెరువులో పలు చోట్ల తాగునీటి సమస్య తలెత్తింది. ఫలితంగా తాగునీటి ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిపోయింది. స్థానికులు నీటిని కొలుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాలువల నిర్మాణానికి తీసిన గుంతల కారణంగా స్థానికులు ఇళ్లలోకి, దుకాణాల్లోకి వెళ్లేందుకు వీలు కావడం లేదు. పెట్రోల్ బంకు ఆనుకుని వెళ్లే మార్గంలో తీసిన గుంతల కారణంగా రోడ్డు మూతపడింది. సంబంధిత ఉన్నతాధికారులు ఇప్పటికైనా చొరవ చూపి జాతీయ రహదారి విస్తరణ పనులు ఒక వైపు నుంచి చేసుకుంటూ పోవాలని, దుమ్ము, ధూళి లేయకుండా రోడ్డుపై ఉన్న మట్టి తొలగించి తరచూ ట్యాంకర్లతో నీరు పట్టాలని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అలాగే తాగునీటి సమస్య ఏర్పడ్డ ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా ఉచితంగా నీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు..

జాతీయ రహదారి విస్తరణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం. దీంతో రెండు వైపుల నుంచి పనులు వేగంగా జరుగుతున్నాయి. రోడ్డుపై దుమ్ము లేయకుండా ఉదయం, సాయంత్రం ట్యాంకర్లతో నీరు పడుతున్నాం. స్థానికుల విజ్ఞప్తి చేరకు మధ్యాహ్నం కూడా నీరు పట్టే విధంగా చర్యలు తీసుకున్నాం. పనులు క్రమబద్ధంగానే చేపడుతున్నాం.

- మధుసూదన్, ఏఈ, ఎన్‌హెచ్ శాఖ, మదనపల్లె

క్రమబద్ధంగా పనులు చేస్తే బాగుండు..



ములకలచెరువులో జాతీయ రహదారి విస్తరణ పనులు క్రమబద్ధంగా చేసుకుంటూ పోయింటే బాగుండు. రోడ్డును ఎక్కడపడితే అక్కడ తవ్వేయడంతో మట్టి మొత్తం రోడ్డుపైకి చేరింది. తరచూ ఈ మార్గంలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో దుమ్ము విపరీతంగా లేస్తోంది. దీంతో దుకాణాల్లో ఉండలేక పోతున్నాం. రోడ్డుపై తరచూ నీళ్ల పడుతూ దుమ్ము లేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- కువైట్ శంకర్, ఎరువుల దుకాణ యజమాని, ములకలచెరువు

అలర్జీ రోగులు ఎక్కువవుతున్నారు..



రోడ్డు పనుల కారణంగా లేస్తున్న దుమ్ము, ధూళి కారణంగా అలర్జీ రోగులు ఎక్కువవుతున్నారు. దుమ్ము ముక్కుల్లోకి వెళ్లి తలతిరుగుతోందని మందుల కోసం వస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు మాస్కులు, కర్చీఫ్‌లు ధరించి తిరుగుతున్నారు. దుమ్ము విపరీతంగా పెరిగిపోయింది. అధికారులు చొరవ తీసుకుని తరచూ నీళ్ల పట్టాలి.

- రమణ, మెడికల్ షాపు నిర్వాహకుడు, ములకలచెరువు


ములకలచెరువు పెట్రోల్ బంకు సమీపంలో రోడ్డు తవ్వేసి పరచిన కంకర


ఆర్టీసీ బస్టాండు వద్ద రోడ్డు కనిపించకుండా చేరిన మట్టి


అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడేనా?



- గుర్రంకొండ మీదుగా ఎర్రచందనం రవాణా
- పాత నిందితులపై నిఘా ఎక్కడ
- పలుమార్లు పట్టుబడ్డ ఎర్రదొంగలు

గుర్రంకొండ, ఫిబ్రవరి 16: జిల్లాలోని గుర్రంకొండ మీదుగా ఎర్రచందనం అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఇటీవల కాలంలో పీలేరు నియోజకవర్గంలోని కలకడ, పీలేరు, కలికిరి, కేవీ పల్లె, గుర్రంకొండ మండలాల్లో ఎర్రచందనం రవాణా ఊపందుకుంది. ఎర్రచందనం రవాణాపై కడప, చిత్తూరు జిల్లాల పోలీసులు దాడులు ముమ్మరంగా చేస్తున్నా స్మగ్లర్లు మాత్రం ఎర్రచందనాన్ని చాకచక్యంగా రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. కడప జిల్లా నుంచి గుర్రంకొండ మీదుగా కర్ణాటకకు రవాణా జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గుర్రంకొండ పట్టణంలో మూడేళ్ల కిందట నెలల వ్యవధిలో రెండు వాహనాలు పట్టుబడగా రూ.అరకోటి విలువ గల ఎర్రచందనం పట్టుబడింది. గుర్రంకొండ మండలానికి అనుసంధానంగా పలు రోడ్డు మార్గాలను కలుపుతూ అడ్డదారులు చాలా ఉన్నాయి. కడప జిల్లా నుంచి చిన్నమండెం, సంబేపల్లె, కలకడ, రంగప్పగారిపల్లె, సూరప్పగారిపల్లె, తరిగొండ, గుర్రంకొండ, ఎల్లుట్ల, సరిమడుగు గ్రామాల గుండా అడ్డదారులు కర్ణాటకకు కలుస్తున్నాయి. ఈ మార్గాలను ఎర్రదొంగలు బాగా వినియోగించుకుంటున్నారు. దీంతో ఎర్రచందనం అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. రెండేళ్ల క్రితం కడప జిల్లా నుంచి ఓ సుమోలో ఎర్రచందనం వస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టారు. కలకడ మండలం నుంచి వాహనం గుర్రంకొండ వైపు రావడంతో పోలీసులు తనిఖీ చేస్తుండగా వాహనం పోలీసులను దాటుకుని అధిక వేగంగా వెళ్లింది. దానిని పోలీసులు వెంబడించగా తిరిగి రాయచోటి మార్గంలో వెళ్లి చెర్లోపల్లె పంచాయతీలోని సూరప్పగారిపల్లె సమీపంలో వ్యవసాయ పొలాల్లో వాహనం వదిలి వెళ్లారు. పోలీసులు వాహనాన్ని సాయంత్రం గుర్తించేసరికే అందులోని దుంగలను మాయం చేశారు.

స్థానిక మార్కెట్ యార్డు వద్ద మూడేళ్ల క్రితం పోలీసులు ఉదయం 5 గంటల సమయంలో తనిఖీలు చేస్తుండగా ఎర్రచందనంతో వచ్చిన ఓ సుమో పోలీసులను చూసి కొద్దిదూరంలోనే వాహనాన్ని నిలిపి డ్రైవర్ పరారయ్యాడు. వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 53 దుంగలు దొరికాయి. పోలీసులు పట్టుకున్న దుంగల విలువ రూ.అరకోటికి పైగా ఉంటుంది. దుంగలతో పాటు వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే కడప జిల్లా నుంచి లారీలో ఎర్రచందనం తీసుకెళ్తూ కురబలకోట మండలంలోని అంగళ్లలో ఓ లారీ పట్టుబడింది. అందులో సుమారు రూ.కోటికి పైగా విలువ చేసే ఎర్రచందనం దొరికింది. ఎర్రచందనంతో వెళ్లిన ఆ లారీ గుర్రంకొండ మీదుగా వెళ్లింది. పట్టణంలో సీసీ కెమెరాల్లో పరిశీలించగా ఉదయం 7 గంటల సమయంలో లారీ ఎర్రచందనంతో వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. ఇలా గుర్రంకొండ మీదుగా ఎర్రచందనం అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఎర్రదొంగలు అడ్డదారులను చాకచక్యంగా వినియోగించుకుని పోలీసుల కళ్లు కప్పి తరలిస్తున్నారు. అంతేకాకుండా గుర్రంకొండలో ఎర్రచందనం రవాణాకు సహకరించే కొందరు డ్రైవర్లు, పైలట్‌లుగా ఉన్నట్లు సమాచారం. జిల్లా పోలీసు అధికారులు అక్రమ రవాణాపై నిఘా ఉంచాల్సి ఉంది.


మార్కెట్ యార్డు వద్ద పట్టుపడిన ఎర్రచందనం దుంగలు, వాహనం (ఫైల్)

గుర్రంకొండలో ఎర్రదొంగలు, డ్రైవర్లు, పైలెట్‌లు

గుర్రంకొండ పట్టణం, గ్రామాల్లో కొందరు ఎర్రచందనం రవాణా చేసే స్మగ్లర్లు ఉన్నారు. మండలంలో ఉన్న ఎర్రదొంగలపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసులు లేకపోయినా పక్క మండలాలు, జిల్లాలో పలు కేసులున్న నిందితులున్నారు. వీరు ఇక్కడ మాత్రం దర్జాగా ఉంటూ బయట వ్యక్తులతో కలిసి ఎర్రచందనం రవాణాను కొనసాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ స్మగ్లర్లకు అనువుగా కొందరు డ్రైవర్లు, పైలెట్‌లు ఉన్నారు.

గతంలో బాడుగ వాహనాలను నడిపే డ్రైవర్లు కొందరు స్మగ్లర్లతో కలిసి సొంత వాహనాలు కొనుగోలు చేసే స్థాయికి చేరారంటే వారు ఏ స్థాయిలో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. స్మగ్లర్లకు వీరి సహకారం మెండుగా ఉండటంతో ఏ దారిలో వెళితే పోలీసుల నుంచి తప్పించుకోవచ్చో వీరు స్మగ్లర్లకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఎర్రచందనం రవాణా గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

నిఘా ఉంచి అక్రమార్కులను పట్టుకుంటాం..

గుర్రంకొండ మండలంలో ఎర్రచందనం అక్రమ కేసులో ఉన్న నిందితుల వివరాలు సేకరిస్తున్నాం. ఈ నిందితుల కదలికలపై నిఘా ఉంచి అక్రమ రవాణాను అడ్డుకుంటాం. ఇక్కడ ఉంటూ ఇతర ప్రాంతాల్లో కేసుల్లో ఉన్న వారి వివరాలను కూడా సేకరించి తగు చర్యలు తీసుకుంటాం.

- పులిశేఖర్, సీఐ, వాల్మీకీపురం సర్కిల్


స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న పోలీసులు (ఫైల్)

చేతులెత్తేశారు..!



- అంతుచిక్కని ఎస్‌డీఐసీ స్కామ్ మూలాలు
- నిర్వాహకుల అన్వేషణలో పోలీసులు
- సుండుపల్లె స్టేషన్‌లో కేసు నమోదు

సుండుపల్లె, ఫిబ్రవరి 16: ఒకరు కాదు.. ఇద్దరు కాదు వందల్లో బాధితులు రెడ్ రాక్ పవర్ లిమిటెడ్ సంస్థ మూలాల అన్వేషణలో పోలీసు అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. అధిక వడ్డీ ఆశ చూపి మేమున్నామని అభయమిచ్చి డబ్బులు కట్టించి లక్షకు రూ.15 వేలు కమిషన్ పొందిన వ్యక్తులు (బినామీలు) మేమేమి చేయాలని చేతులెత్తేశారని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుండుపల్లె మండలానికి చెందిన బాధితులు ఉన్న గ్రూపులో సుమారు 485 మంది వ్యక్తులు ఉన్నారు. కొంత మంది ముఖ్యమైన వ్యక్తులు ఫోన్లకు సైతం అందుబాటులో లేనట్లు బాధితులు చెబుతున్నారు. 'మేము జాయిన్ అయ్యాము.. ప్రతిరోజు వడ్డీ అకౌంట్లలో పడుతోంది. మీరు జాయిన్ కండి.. మరికొంత మంది సభ్యులను జాయిన్ చేయండి.. పెద్ద మొత్తంలో కమీషన్ వస్తుందని' గుట్టుచప్పుడు కాకుండా సుండుపల్లెలో ప్రచారం జరిగినట్లు బాధితులు చెబుతున్నారు. తమ కుటుంబ సభ్యులతో పాటు మిత్రులు, బంధువులను సైతం ఈ సంస్థలో భాగస్వాములయ్యేలా చేశాము. బంధువుల నుంచి తమకు తీవ్ర ఒత్తిడి వస్తోంది. తమకు ఈ విధంగా సమాచారం ఇచ్చి జాయిన్ చేయించిన వ్యక్తులను అడిగితే 'నీలాగే మేము కూడా మోసపోయాము. పోలీసులకు ఫిర్యాదు చేయండి' అని ఉచిత సలహా ఇస్తున్నట్లు మండల కేంద్రంలోని కొందరు బాధితులు తెలిపారు.

ఇక అరకొరగా కట్టిన డబ్బును కమీషన్ రూపంలో వడ్డీల రూపంలో పొందిన వ్యక్తులు మాత్రం హమ్మయ్య మాకు ఇంతే నష్టం జరిగింది అని చెప్పుకుంటుండగా.. పెద్ద మొత్తంలో నష్టపోయిన బాధితులు మాత్రం ఆందోళనలో ఉన్నారు. చాలా మంది పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసేందుకు మొగ్గు చూపడం లేదని సమాచారం. నష్టపోయాము అని పోలీసులకు చెబితే తమకేమైనా సమస్య వస్తుందేమో అని భయపడుతున్నారు. మరికొందరు పోయింది ఎలాగో పోయింది. వస్తే రాని రాకపోతే లేదు. అని గుట్టుచప్పుడు కాకుండా ఉండిపోయారు. అయితే అప్పు చేసి, బంగారు కుదువ పెట్టి, వడ్డీకి తెచ్చి ఇంట్లో తల్లిదండ్రులకు తెలియకుండా డిపాజిట్ చేసిన వ్యక్తులు మాత్రం తమ డబ్బు తమకు ఇప్పించండి మహాప్రభో అని తమతో కట్టించిన వ్యక్తులపై ఒత్తిడి చేస్తున్నారని సమాచారం. ఇప్పటికే సుండుపల్లెలో ఈ సంస్థ ప్రతినిధులుగా పనిచేసిన వ్యక్తులను సైబర్ క్రైం పోలీసులు విచారిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో పెద్ద సంఖ్యలో యువకులు, ఉద్యోగులు, మహిళలే ఉండడం. వారినే టార్గెట్ చేసి డబ్బులు కట్టించినట్లు తెలుస్తోంది. ఈ సంస్థలో నగదు జమ చేసిన వారికి న్యాయం జరుగుతుందా? ఈ స్కామ్ మూలాలు బయటకు వస్తాయా ? లేదా అనేది వేచి చూడాలి. ఇదే విధంగా గతంలో పలు రకాల స్కాముల్లో సుండుపల్లె ప్రజలు బాధితులయ్యారు. అన్నీ తెలిసి కూడా అధిక వడ్డీలకు ఆశపడి డబ్బులు జమ చేయడం ఏమిటని పలువురు జోరుగా విమర్శిస్తున్నారు.

కేసు నమోదు చేశాము..



కొంత మంది స్థానికుల ప్రమేయంతో రెడ్‌రాక్ పవర్ లిమిటెడ్ సంస్థలో నగదు జమ చేసి మోసపోయామని స్పందనలో, మరికొంత మంది ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేశాము. బాధితులు స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోండి. ఈ స్కామ్ వ్యవహారంపై విచారణ జరుగుతోంది. ఇలాంటి యాప్‌లను నమ్మి మోసపోకండి.


- హుస్సేన్, సుండుపల్లె ఎస్ఐ

వేడుకగా రథోత్సవం

- దేవునికడపకు పోటెత్తిన భక్త జనం



కడప (కల్చరల్), ఫిబ్రవరి 16: తిరుమలకు తొలిగడపగా దేవునికడపలో కొలువుదీరిన వేంకటేశ్వరుని రథోత్సవం శుక్రవారం వేడుకగా సాగింది. లక్ష్మీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా రథోత్సవం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి స్వామిని దర్శించుకోవడానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకున్నారు. గోవిందా నామస్మరణతో దేవుని కడప మార్మోగింది. టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి రథాన్ని అందంగా ముస్తాబు చేశారు. భక్తులు కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి ధూళి ఉత్సవం నిర్వహించారు. తదుపరి అన్నమయ్య కీర్తనలు, కోలాటాలు, హరికథ గానాలు నిర్వహించి భక్తులకు వీనుల విందు గావించారు.


చిన్నపోతుల ప్రాజెక్టు

హామీలన్నీ నీటిమూటలేనా..!

- శిథిలావస్థలో చిన్నపోతుల ప్రాజెక్టు
- ఎన్నికలకు ముందే లక్కిరెడ్డిపల్లెకు సాగునీరు అందిస్తామన్న ప్రభుత్వం
- 5 ఏళ్లలో ప్రాజెక్టుల సంగతే మరిచారు...
- రెండు నెలల్లో 400 క్యూసెక్కుల నీరు అందేనా?

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 16: తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలకు సాగునీరు అందిస్తామని ఇచ్చిన హామీలు నీటిమూటలయ్యాయి. అధికారంలోకి వచ్చి ఇన్నేళ్లవుతున్నా వైసీపీ ప్రభుత్వం వాటిని మరిచిందని ఇక్కడి ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గండికోట ప్రాజెక్టు నుంచి కెనాల్ ఏర్పాటు చేసి కడప, చిత్తూరు జిల్లాలకు సాగునీరు అందిస్తామని అది కూడా 2024 ఎన్నికలకు ముందే అన్ని మండలాలకు సాగునీరు అందించి ఎన్నికలకు వెళతామని ఆ ప్రభుత్వం 2019లో తెలిపింది. ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లు కావస్తున్నా ఇంతవరకు ఒక్క చిన్న పని కూడా చేయలేదు. ఇక ఎన్నికలు రెండు నెలల్లోపే జరగనున్నాయి. ఈ కొద్దిరోజుల్లోనే శిథిలావస్థలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయ్యేది ఎన్నడోనని ప్రజలు, రైతులు అంటున్నారు. గండికోట ప్రాజెక్టు నీటిని కెనాల్ ద్వారా చక్రాయపేట మండలం కాలేటివాగు ప్రాజెక్టుకు నింపి 400 క్యూసెక్కుల నీటిని లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు మండలాలకు సాగునీరు అందించేందుకు ప్రతిపాదనలు పంపారు. అయితే ప్రస్తుతం చక్రాయపేట కాలేటివాగు ప్రాజెక్టు నుంచి పనులు ప్రారంభించి లక్కిరెడ్డిపల్లె వరకు పైపులైను పనులు మాత్రమే చేశారు. అయితే లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలకు కాలేటివాగు ప్రాజెక్టు నుంచి నీరు తెచ్చి ఈ రెండు మండలాల్లోని 44 చెరువులకు మరమ్మతులు చేసి సాగునీరు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. చక్రాయపేట మండలం నుంచి లక్కిరెడ్డిపల్లె మండలంలోని చంచర్లపల్లె మొరుగుల చెరువుకు 400 క్యూసెక్కుల నీటిని చిన్నపోతుల ప్రాజెక్టుకు నింపి అందులో నుంచి 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి మండలంలోని అన్ని చెరువులకు నీరు నింపాలన్నది లక్ష్యం. అయితే మండలంలో ఇంతవరకు కాలువ పనులు గాని, పైపులైను పనులు కానీ ప్రారంభించలేదు. దీనికి తోడు 44 చెరువుల్లోని 20 చెరువులు పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయి. వాటిని మరమ్మతులు చేసి నీటిని ఎప్పుడు నింపుతారో తెలియడం లేదు. అంతేకాకుండా కాలువల నిర్మాణానికి, పైపులు వేయడానికి రెండు మండలాల్లోని రైతుల వద్ద నుంచి ప్రభుత్వం భూములు కొనుగోలు చేయాల్సి ఉంది. ఇదంతా ఎప్పుడు జరుగుతుందో తెలియడం లేదు. చిన్నపోతుల ప్రాజెక్టు కాలువల ద్వారా రామరాజువంకకు, దిన్నెపాడు చెరువు, కల్పనాయుని చెరువులకు నీరు అందించాల్సి ఉంది. ఏదేమైనా ప్రభుత్వం రెండు నెలల్లో కోట్ల రూపాయల పనులు చేసి ఈ రెండు మండలాలకు కాలేటివాగు నీరు అందించడం సాధ్యమయ్యే పని కాదని, ఈ ప్రభుత్వం మాటల ప్రభుత్వమే కానీ చేతల్లో ఏదీ చూపడం లేదని రైతులు విమర్శిస్తున్నారు.


అధ్వానంగా ఉన్న ప్రాజెక్టు కాలువ


కూలిపోయిన కుడి, ఎడమ కాలువలు

30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు..



1990లో చిన్నపోతుల ప్రాజెక్టు ఏర్పాటు చేశారు. అప్పట్లో ప్రాజెక్టు అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ రెడ్డెప్ప ప్రాజెక్టుకు కుడి, ఎడమ కాలువలు ఏర్పాటు చేశారు. దీంతో వందల ఎకరాలకు సాగునీరు అందేవి. పాళెం, గొల్లపల్లె, మామిడిగారిపల్లె, చంచర్లపల్లె, బి.ఎర్రగుడి గ్రామాలకు సాగునీరు అందేవి. ప్రస్తుతం కాలేటివాగు నుంచి నీటిని అందిస్తామన్నారు. ఇంతవరకు ఎక్కడేకాని పనులు మొదలు పెట్టలేదు. ఇంక నీళ్లు ఎప్పుడు ఇస్తారు.

- నాగమల్లయ్య, రైతు, చిన్నపోతులపల్లె

పట్టించుకునే నాథుడే లేడు..



చిన్నపోతుల ప్రాజెక్టు నిర్మించి 30 సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు మరమ్మతులకు నోచుకోలేదు. శేషాచల అడవుల్లో పడ్డ వర్షపు నీరు ప్రాజెక్టుకు చేరుకుంటుంది. అయితే చుక్కనీరు నిల్వ ఉండదు. ఎందుకంటే కాలువ, తూములు శిథిలావస్థలో ఉన్నాయి. వాటిని మరమ్మతులు చేస్తే నాలుగు పంచాయతీల్లోని 1100 ఎకరాలకు సాగునీరు అందుతుంది.

- రెడ్డెయ్య, రైతు, చిన్నపోతులపల్లె

వైభవంగా కోదండరాముని గ్రామోత్సవం


భక్తులకు దర్శనమిస్తున్న సీతారామలక్ష్మణులు

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 16: ఏకశిలానగిరి కోదండ రామాలయంలో రథసప్తమి వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. రథసప్తమి పురస్కరించుకొని వేకువజాము నుంచి టీటీడీ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం సూర్యవాహన అలంకారంలో సీతారామ లక్ష్మణుల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పురవీధుల గుండా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. స్వామి వారికి పెద్ద ఎత్తున మహిళలు కాయ, కర్పూరం సమర్పించి దర్శించుకున్నారు. కార్యక్ర మంలో టీటీడీ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై సౌమ్యనాథుడు


ఉదయం సూర్యప్రభ వాహనంపై దర్శనమిచ్చిన సౌమ్యనాథుడు

నందలూరు, ఫిబ్రవరి 16: నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయంలో రథసప్తమి పురస్కరించుకొని శుక్రవారం ఉదయం స్వామివారు కూర్మాలంకారంలో, రాత్రి కృష్ణ భగవానుని అలంకారంలో సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం


ప్రత్యేక పూజా కార్యక్రమంలో దాతలు

నందలూరు, ఫిబ్రవరి 16: ఆడపూరు గ్రామ పంచాయతీ పరిధిలోని దిగువ దళితవాడలో సీతారాముల ఆలయ నిర్మాణానికి గడికోట సుబ్బారెడ్డి (జేసీబీ సుబ్బారెడ్డి), జడ్పీటీసీ సభ్యురాలు గడికోట ఉషారాణి దంపతులు రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు. శుక్రవారం ఆలయంలో సీతారామ లక్ష్మణ హనుమంతుల వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వేదపండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం కల్యాణ మహోత్సవాన్ని గోవిందనామ స్మరణల నడుమ కన్నుల పండువగా నిర్వహించారు.

బాసట హోంకు రూ.50 వేలు వితరణ


నగదును అందిస్తున్న ఎన్‌ఆర్‌ఐ హర్షిత్

కడప(ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 16: కడప నగరం బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాసట చిల్డ్రన్స్ హోంకు ఎన్‌ఆర్‌ఐకి చెందిన వై.హర్షిత్ రూ.50వేలు వితరణ చేశారు. హౌసింగ్ బోర్డుకాలనీ కోదండ రామాలయ ధర్మకర్త వెంకటరెడ్డి ద్వారా ఆయన చిల్డ్రన్స్ హోం గురించి తెలుసుకుని తన తల్లిదండ్రులైన మంజుల, మనోహర్‌రెడ్డి పేరు మీద హోం నిర్వాహకులైన ఎం.బాలాజీ, కార్తీక్‌రెడ్డిలకు నగదు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు.

యూసీఐఎల్ టెయిలింగ్ పాండ్ పైప్‌లైన్ లీకేజీ

- పంట పొలాల్లోకి యురేనియం వ్యర్థాలు
- రైతుల నుంచి వ్యతిరేకత వస్తుందని ఎక్సకవేటర్‌తో పనులు


వ్యర్థాలు కనిపించకుండా ఎక్సకవేటర్‌తో చదును చేస్తున్న దృశ్యం

పులివెందుల, ఫిబ్రవరి 16: వ్యర్థాల నిల్వలో యూసీఐఎల్ మరోసారి నిర్లక్ష్యం ఆవహించింది. నాలుగు రోజులుగా యూసీఐఎల్‌లో భద్రతావారోత్సవాలు సాగుతున్న సమయంలోనే టెయిలింగ్ పాండ్‌కు వ్యర్థాలను తరలించే పైప్ లైన్ లీకేజీ కావడం కలకలం రేపుతోంది. వివరాలిలా..

పులివెందుల నియోజకవర్గం ఎం.తుమ్మలపల్లె వద్దనున్న యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా మారుతోంది. అటు వాతావరణానికి, ఇటు మానవాళికి ముప్పుగా ఉండే యురేనియం వ్యర్థాల విషయంలో యూసీఐఎల్ నిర్లక్ష్యం వహిస్తూనే ఉందని సర్వత్రా విమర్శలు ఉన్నాయి. యురేనియం వ్యర్థాలను నిల్వ చేసే టెయిలింగ్ పాండ్‌ను యూసీఐఎల్ సదా పర్యవేక్షిస్తూ ఉండాలి. కానీ ఇక్కడ పదేపదే పైప్‌లైన్ లీకేజీలు కావడం పరిపాటిగా మారుతోంది. అందులో భాగంగా గురువారం యూసీఐఎల్ నుంచి టెయిలింగ్ పాండ్‌కు వ్యర్థాలను తరలించే పైప్‌లైన్ లీకేజీ అయింది. దాదాపు 12 నుంచి 15గంటల పాటు వ్యర్థాలు పొలాల్లోకి ప్రవహించాయి. దీనిని గమనించిన కొందరు రైతులు యూసీఐఎల్ అధికారులుకు తెలియజేశారు. అధికారులు అప్రమత్తమై శుక్రవారం పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి లీకేజీ అయిన యురేనియం వ్యర్థాలు బయటకు కనిపించకుండా ఎక్సకవేటర్ సాయంతో ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయించారు. ఆ వ్యర్థాలు మనుషులు, పశువులకు తాకితే చర్మం పూర్తిగా ఊడిపోతుందని సమాచారం. ఇలాంటి ప్రమాదం జరుగుతుందేమో అనే ఆందోళనతో యూసీఐఎల్ అప్పటికప్పుడు ఎక్సకవేటర్ సాయంతో చదును చేయించింది. ఈ పనులను కేకేకొట్టాల వాసులు కొందరు ఫొటోలు తీస్తుంటే యూసీఐఎల్ సిబ్బంది వారిని అడ్డుకొని అక్కడి నుంచి పంపించారు. ఈ విషయాన్ని గ్రామస్థులు ఆంధ్రజ్యోతికి చేరవేశారు. దీనిపై యూసీఐఎల్ అధికారులను ఫోన్‌లో వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.


కేకే కొట్టాల సమీపంలో లీకైన యూసీఐఎల్ వ్యర్థాలు

కాగా.. నాలుగు రోజులుగా యూసీఐఎల్‌లో భద్రతా వారోత్సవాలు సాగుతున్నాయి. భద్రతా వారోత్సవాలు సాగుతున్న సమయంలోనే యూసీఐఎల్ నిర్వహణలో లోపాలు బయటపడడం ఎంతో దారుణం. యూసీఐఎల్‌లో ప్రధానంగా టెయిలింగ్ పాండ్ భద్రత ఎంతో ముఖ్యం. కానీ టెయిలింగ్ వ్యవహారాన్ని యూసీఐఎల్ గాలికి వదిలేసిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. టెయిలింగ్ పాండ్‌తోనే తమ పంటలు, మనుషుల ఆరోగ్యాలు, పశుసంపద పూర్తిగా నాశనం అవుతున్నాయని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు సరుడు అపహరణ


సంఘటనా స్థలంలో విచారిస్తున్న ఎస్ఐ రుషికేశవ రెడ్డి

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 16: నగర పంచాయతీ పరిధిలోని అడ్డరోడ్డు సమీపంలో పట్టపగలు వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కెళ్లిన సంఘటన శుక్రవారం కమలాపురంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రుషికేశవరెడ్డి సమాచారం మేరకు... క్రాస్ రోడ్డు వద్ద పెద్దచెప్పలి రోడ్డులో మీగడ గంగమ్మ నివాసం ఉంటోంది. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 3.30 గంటలకు తన ఇంటి ముందు మంచంపై కూర్చుని ఉండగా అదే అదనుగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో నుంచి సుమారు 3 తులాల బంగారు చైన్‌ను లాక్కుని పారిపోయినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసిందన్నారు. ఆ ఫిర్యాదు మేరకు కమలాపురం పోలీసులు విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలి

- తహసీల్దారు కార్యాలయం ఎదుట జేఏసీ నిరసన



నిరసన తెలుపుతున్న ఏపీ జేఏసీ ఉద్యోగులు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లలో భాగంగా మధ్యంతర భృతిఐ(ఐఆర్) 30 శాతం ప్రకటించాలని ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ శ్రీనివాసులు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, కన్వీనరు డి.రవికుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల కార్యచరణ ఐక్య సమితి(జేఏసీ) పిలుపు మేరకు మూడవ రోజైన శుక్రవారం భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి కడప తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ నాలుగేళ్ల నుంచి ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. 12వ పీఆర్సీని అమలు చేయాలని, ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్, డీఏ, అరియర్స్‌ను వెంటనే చెల్లించాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, నగదు రహిత వైద్యం అందించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించాలని, లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈనెల 17న కలెక్టరేట్, 20న జిల్లాలో ర్యాలీలు, ధర్నాలు చేస్తామని, 27న చలో విజయవాడలో ర్యాలీ. ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు నిత్యపూజయ్య, బ్రహ్మానందరెడ్డి, బాలపుల్లయ్య, వాసన్, నరేంద్ర, చిన్నయ్య, శైలేశ్వరరెడ్డి, పద్మనాభం, మోహన్‌రెడ్డి, కాటమయ్య, శ్రీనివాసులు, బాలయ్య, భూషణం, రాధాకృష్ణ, కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 16: ఉద్యోగులకు ప్రభుత్వం 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) పిలుపు మేరకు శుక్రవారం భోజన విరామ సమయంలో మూడవ రోజు ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో రాయచోటి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్‌యాదవ్, రాయచోటి జేఏసీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం నాలుగు సంవత్సరాల నుంచి ఉద్యోగులకు రావాల్సిన ఐఆర్ 30 శాతంతో పాటు పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. అలాగే 12వ పీఆర్‌సీ అమలు చేయాలని, డీఏ, పీఆర్‌సీ అరియర్స్‌ను వెంటనే ఇవ్వాలని, ఓపీఎస్‌ను అమలు చేయాలని, తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. అంతేగాక 11వ పీఆర్‌సీ అరియర్స్‌ను వెంటనే ఇవ్వాలని, ఈహెచ్‌ఎస్ కింద అన్ని నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో నగదు రహిత వైద్యం అందించాలని, ఐఆర్ 30 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక చొరవ చూపి పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ నెల 20న జిల్లాలో నిరసన ర్యాలీ చేపట్టి ధర్నా, 27వ తేదీ ఛలో విజయవాడ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ యూటీఎఫ్ జాబీర్, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చెంగల్‌రెడ్డి, కార్యదర్శి ఈశ్వరయ్య, ఎన్జీవో సంఘం నేతలు మహమ్మద్‌బాషా, శ్రీనివాసులు, ప్రమీలమ్మ, దేవేంద్ర, శివారెడ్డి, జయరామయ్య, రామక్రిష్ణయాదవ్, ముద్దుకృష్ణ, మహాదేవ, శ్రీనివాసులు, వరలక్ష్మి, పార్వతి, పద్మ, రమణ, గణేశ్, రామక్రిష్ణ, రాజేశ్, నాగరాజు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు రమణ, జయచంద్రారెడ్డి, వీరనాగిరెడ్డి, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: విద్యార్థులకు ఆహ్లాదకరమైన సదుపాయాలను కల్పించడంతో పాటు విద్యాప్రమాణాలు పెంచాలని కలెక్టర్ విజయరామరాజు విద్యాలయ యాజమాన్య కమిటీ సభ్యులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో కేంద్రీయ విద్యాలయ యాజమాన్య కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యాలయంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో చదివేలా సదుపాయాలు ఉండాలన్నారు. ఈ ఏడాది జరిగే 10, 12వ తరగతి పరీక్షా ఫలితాల్లో కడప కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. హార్స్‌డ్రైవింగ్ శిక్షణ కూడా అందించేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. తాగునీరు, విద్యుత్ దీపాలు, స్టాఫ్ క్వార్టర్స్, రోజువారీ నీటి అవసరాలకు బోర్ వెల్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు.

మైలవరం నుంచి దక్షిణ కాలువకు నీరు విడుదల

మైలవరం, ఫిబ్రవరి 16: మైలవరం జలాశయం నుంచి దక్షిణకాలువకు రోజుకు 500 క్యూసెక్కుల నీటిని జిల్లా వ్యవసాయ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి శుక్రవారం నీటిని విడుదల చేశారు. గండికోట జలాశయం నుంచి రోజుకు 1000 క్యూసెక్కుల మేర నీరు వచ్చి మైలవరంలో చేరుతుండటంతో దక్షిణకాలువకు తాగు, సాగునీటి అవసరాలకోసం రోజుకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరుగుతోందన్నారు. ప్రస్తుతం మైలవరం జలాశయంలో 0.5 టీఎంసీల నీరు నిల్వ ఉందని జలాశయ ఏఈఈ గౌతమ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ సిబ్బంది, నాయకులు మహేశ్వరరెడ్డి, విష్ణు,రామాంజనేయయాదవ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

వల్లూరు, ఫిబ్రవరి 16: మండల కేంద్రమైన కడప - తాడిపత్రి కట్ట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అయ్యవారయ్య (62) అనే వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు తన ద్విచక్ర వాహనంలో అయ్యవారయ్య తన పని మీద వెల్లటూరు వెళుతుండగా ఐచర్ వాహనం వచ్చి ఢీకొన్న సంఘటనలో తీవ్రగాయాలైనట్లు తెలిపారు. అతన్ని స్థానికులు 108లో కడప రిమ్స్‌కు తరలించగా వైద్యులు చికిత్స చేస్తుండగా గాయపడ్డ వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని కుమారుడు భీమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం బాటిళ్ల పట్టివేత


మద్యం బాటిళ్లను చూపుతున్న సీఐ, ఎస్ఐ

వేంపల్లె, ఫిబ్రవరి 16: మండలంలోని ముతుకూరు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 102 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు. అందిన సమాచారంతో ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పోలీసు సిబ్బంది దాడులు చేయగా ఓ వ్యక్తి వద్ద అక్రమంగా ఉన్న మద్యం బాటిళ్లను పట్టుకొని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ

- ఇరువురికి తీవ్రగాయాలు

వీరబల్లి, ఫిబ్రవరి 16: మండల పరిధిలోని తాటికుంటపల్లె పంచాయతీ కొత్తపల్లెకు చెందిన అన్నదమ్ముల మధ్య శుక్రవారం రాత్రి ఘర్షణ చోటుచేసుకుంది. నాటుసారాపై పోలీసులు నిఘా ఉంచి పై తెల్పిన గ్రామంలో విచారణ సాగించారు. ఈ క్రమంలో వీరిపల్లె వెంకటేశ్ సారా కాచుతున్నాడని ఆయన తమ్ముడు ఆంజనేయులు పోలీసులకు సమాచారం ఇచ్చాడనే నెపంతో అతనిపై, ఆయన భార్య జయమ్మలపై.. వెంకటేశ్, శ్రీను, నాగవేణి, లక్ష్మీదేవిలు దాడి చేశారు. ఇనుపరాడ్లు, కొడవలితో విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారని, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన బీజేపీ ప్రభుత్వం

● కార్మిక, రైతు సంఘాల నేతలు


రాయచోటి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనలో కార్మిక, రైతు సంఘాల నేతలు, కార్మికులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 16: దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి... కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ తీరని అన్యాయం చేస్తోందని కార్మిక, రైతు సంఘాల నాయకులు సాంబశివ, రామాంజులు, తోపు కృష్ణప్ప, వంగిమళ్ల రంగారెడ్డి, రామచంద్రలు ఆరోపించారు. శుక్రవారం గ్రామీణ భారత్ బంద్ పారిశ్రామిక సమ్మెలో భాగంగా రాయచోటి తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మిక రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సర్కిల్ వద్ద మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా కార్మిక వర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసిన బీజేపీ ప్రభుత్వం కేవలం నాలుగు కార్మిక కోడ్లను తెచ్చి కార్మికుల పొట్టకొడుతోందన్నారు. రైతాంగ ఉద్యమానికి తలవంచి వ్యవసాయ నల్లచట్టాలను రద్దు చేసినప్పటికీ మరో రూపంలో వాటిని అమలు పర్చడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గత పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల ఆదాని, అంబానీలు ప్రపంచ కుబేరుల జాబితాలో చేరుగా పేద రైతులు, కౌలు రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు కనీస వేతనాలు, పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న రాష్ట్రంలో ఉన్న అధికార, ప్రతిపక్ష పార్టీల ఎంపీలు నోరు మెదపకపోవడం దారుణ మన్నారు. ప్రత్యేక హోదాను నిరాకరించిందని, వెనుక బడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ఇవ్వాల్సిన ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయడం లేదని, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఇవ్వకపోగా తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్కీం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని, అంగన్వాడీ, మున్సిపల్ కార్మికులు సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నేలపాటి శ్రీనివాసులు, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్‌నాయక్, రైతు సంఘం జిల్లా కార్యదర్శులు వంగిమళ్ల రంగారెడ్డి, రామచంద్ర, హరి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సలీంబాషా, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోషియేషన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరి, హాన్సెన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎండీసీలో కార్మిక సంఘాల నిరసన


ఏపీఎండీసీ పరిపాలన భవనం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 16: గ్రామీణ భారత్ బంద్‌కు మద్దతుగా ఏపీఎండీసీ పరిపాలన భవనం ఎదుట కార్మిక సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీఎండీసీ అవుట్ సోర్స్ అండ్ ట్రైనీ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త కార్మిక, రైతు సమ్మెకు సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాలు మద్దతు ఇవ్వడం వలన ఏపీఎండీసీ కార్మికులు, త్రివేణి కార్మికులు, స్వచ్ఛందంగా విధులకు హాజరు కాకుండా లాస్ ఆఫ్ పే వేసుకోవడంతో మైనింగ్‌లో రవాణా వ్యవస్థ పూర్తిగా ఆగిపోవడం జరిగింది. డిస్పాచ్‌లో ప్రైవేటు లారీ ఓనర్స్ కూడా స్వచ్ఛందంగా సమ్మెకు పూర్తి మద్దతు ఇచ్చి టిప్పర్స్ నిలుపుదల చేసి ఉద్యమంలో పాల్గొన్నారు. పోరాట కమిటీ జేఏసీ కన్వీనర్ ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసి.. ఉన్న చట్టాలను యధావిధిగా కొనసాగించాలని, అలాగే కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, 12 గంటలు పని దినాలు పెట్టాలని చట్టం చేయడాన్ని ఉపసం హరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ నారదాసు సుబ్బరాయుడు, అధ్యక్షుడు కుప్పాల సుబ్రహ్మణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.దేవకుమార్‌రెడ్డి, మావిళ్ల శేఖర్, గునిపాటి సుబ్రహ్మణ్యం, గునిపాటి రవి, పి.రమణయ్య, వర్కర్స్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ నాగరాజు, పోరాట కమిటీ నాయకులు మావిళ్ల రాధా, జి.వెంకటేష్, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

దగాపరిచే చట్టాలను రద్దు చేయాలి

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 16: రైతులు కార్మికులకు దగా పరిచే చట్టాలని రద్దు చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు అంకిపల్లి చెంగయ్య తెలిపారు. అఖిల పక్షాల ఆధ్వర్యంలో గ్రామీణ భారత్ బంద్‌కు మద్దతుగా ఓబులవారిపల్లె ఆసుపత్రి నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు రైతులకు అన్యాయం చేసే చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తే రైతులకు రుణమాఫీ, తక్కువ ధరకే గ్యాస్ సిలిండర్లు, విద్యుత్ చార్జీల తగ్గింపు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు, కార్మిక సంఘాలు నాయకులు, కేవీపీఎస్ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు జయరామయ్య, సీపీఐ మండల కార్యదర్శి నాగమ్మ, అంకిపల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి


ఆలయాన్ని పరిశీలిస్తున్న ఈవో

గాలివీడు, ఫిబ్రవరి 16: గుండ్లచెరువు గ్రామంలోని మల్లేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తామని ఈవో కొండారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని గుండ్లచెరువు గ్రామంలో దుర్గమ్మ చెరువు దగ్గర వెలిసిన పురాతనమైన మల్లేశ్వరస్వామి శివాలయాన్ని గ్రామస్తులతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ దేవదాయశాఖలో ఈ ఆలయం ఉన్నందున ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి ఆలయ అభి వృద్ధికి అన్ని విధాలుగా చర్యలు చేపడతామన్నారు. శిథిలా వస్థకు చేరిన ఈ ఆలయం చుట్టూ వారం రోజులుగా గ్రామస్తులు, యువకులు పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం ఆయన గాలివీడు పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని కమిటీ సభ్యులతో కలిసి సందర్శించారు.

తోటపాలెంలో చోరీకి యత్నం

నందలూరు, ఫిబ్రవరి 16: మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లె పరిధిలోని తోటపాలెంలో శుక్రవారం వేకువ జామున ఓ దొంగ చోరీకి యత్నంచాడు. ఇంట్లోని వారు గమనించి పట్టుకోవడానికి ప్రయత్నించగా తప్పించుకుని పారిపోయాడు. బాధితుల కథనం మేరకు... తోటపాలెంలో మహబూబ్‌బాషా అనే వ్యక్తి ఇంటిలోకి ఓ దొంగ చొరబడ్డాడు. మహబూబ్ బాషా కొడుకు అబ్దుల్లా వేకువ జామున 2.15 గంటల సమయంలో కాలకృత్యాలు తీర్చుకుని తిరిగి ఇంటిలోనికి వెళ్లే సమయంలో అపరిచిత వ్యక్తి ఇంటి వరండాలో తారసపడటంతో గట్టిగా అరిచి పట్టుకునేందుకు ప్రయత్నించాడు. దీంతో తండ్రి మహబూబ్ బాషా పరుగున బయటికి వచ్చి అతన్ని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. అయితే తండ్రీ కొడుకులను నెట్టి పారిపోయాడు. ఈ సమచారం పోలీసులకు తెలియజేయడంతో ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ సంఘటనా స్థలికి చేరుకుని పరిసరాలను పరిశీలించి సెల్‌ఫోన్ స్వాధీనం పరుచుకున్నట్లు బాధితులు తెలిపారు.

వైసీపీకి ఓటమి రుచిచూపిస్తాం

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 16: నియోజకవర్గంలో వైసీపీకి ఓటమి రుచి చూపిస్తామని టీడీపీ నియోజకవర్గ మహిళా నాయకురాలు నగిరిపాటి రేవతి తెలిపారు. శుక్రవారం నియోజకవర్గంలోని లింగిరెడ్డిపల్లె, చిన్నంఎల్లె, పెద్దఓరంపాడు, పాపిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని ప్రచారం చేశారు.

ఓబులవారిపల్లెలో..: మండలంలోని పెద్దఓరంపాడు, చిన్నఓరంపాడు, లింగిరెడ్డిపల్లె, పాపిరెడ్డిపల్లె గ్రామాలలో టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో అధికారంలోకి రాగానే అవలంబించబోయే సూపర్ సిక్స్ సంక్షేమ కార్యక్రమాలపె ప్రచారం చేశారు.

ప్రతి ఇంటికి మీటర్ తప్పక ఉండాలి

● అక్రమంగా విద్యుత్ వాడితే చర్యలు
● ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలి
● విద్యుత్‌శాఖ అధికారి ఎస్పీ రమణ


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యుత్‌శాఖ అధికారి రమణ

రామాపురం, ఫిబ్రవరి 16: ప్రతి ఇంటికి మీటర్ తప్పకుండా ఉండాలని.. మీటర్ లేకుండా అక్రమంగా విద్యుత్ వాడితే చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యుత్‌శాఖ అధికారి రమణ తెలిపారు. శుక్రవారం రామాపురంలోని రహదారుల భవనాలశాఖ అతిథి గృహంలో మండలస్థాయి విద్యుత్‌శాఖ అధికారులతో జరిగిన సమావేశం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. ప్రస్తుతం వేసవి కాలం వస్తున్న దృష్ట్యా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పగటి సమయాల్లో విద్యుత్ దీపాలు ఎక్కడ వెలగకుండా చూడాలని గ్రామ సచివాలయ లైన్‌మెన్‌లకు ఆదేశించారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాల నివారణకు క్షేత్రస్థాయి అధికారుల సలహాలు తీసుకోవా లన్నారు. వ్యవసాయ పొలాల చుట్టూ విద్యుత్ కంచె ఏర్పాటు చేసి అక్రమంగా విద్యుత్‌ను వాడుతున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల నుంచి వచ్చే విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాయచోటి డివి జన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏడీఏ వరప్రసాద్, వీరబల్లి ఏఈ రమేశ్‌బాబు, లక్కిరెడ్డిపల్లె ఏఈ హరిప్రసాద్, అకౌంట్స్ అధికారులు విద్యుత్‌శాఖ లైన్‌మెన్లు సిబ్బంది పాల్గొన్నారు.

ఈకేవైసీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు


సమావేశంలో మాట్లాడుతున్న జేడీ చంద్రనాయక్

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 16: ప్రతి రైతు నుంచి ఈకేవైసీ చేయించాలని.. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అన్నమయ్య జిల్లా సంయుక్త సంచాలకులు చంద్రానాయక్ ఆర్‌బీకే సిబ్బందిని హెచ్చరించారు. ప్రధానమంత్రి కిసాన్‌పథకం ద్వారా రైతుల ఖాతాలో రూ.2వేలు జమ అవుతాయని... ఈకేవైసీ చేయించాలని ఆదేశాలు జారీ చేసినా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రామాపురం, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, వీరబల్లి మండలాలకు చెందిన రైతు భరోసా కేంద్రం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ఈకేవైసీ చేయించాలని నెల ముందు చెప్పినా... ఎవరు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని.. ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈనెల 21వ తేదీ లోపు ఈకేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్‌బీకేలకు ప్రభుత్వం అందిస్తున్న విత్తనకాయలు, ఎరువులు, ఇతర సామగ్రి రైతులకు సక్రమంగా అందించాలన్నారు. రైతుల నుంచి తమకు ఎరువులు, విత్తనాలు అందడం లేదని ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె సహాయ సంచాలకులు జయరాణి, ఏవో రమేష్‌బాబురావు, ఏఈఓలు కెరోలిన్ ,అనూష, ఏఈ చాన్‌బాషా, ఆర్‌బీకే సిబ్బంది పాలొన్నారు.

హడావిడిగా ప్రారంభోత్సవాలు

ఆసరా సభలో ఎమ్మెల్యే, ఎంపీ ప్రసంగం పూర్తికాక మునుపే జారుకున్న మహిళలు


రైల్వేకోడూరులో జరిగిన సభలో ప్రజాప్రతినిధులు మాట్లాడుతుండగానే వెళ్లిపోతున్న మహిళలు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 16: పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయాల ఆవరణలో శుక్రవారం విలేజ్‌క్లినిక్, రైతు భరోసా కేంద్రం, సచి వాలయాలు, చిట్వేలి రూటులో వైద్యవిధానపరిషత్ 50 పడకల ఆస్పత్రి భవనాలను వైసీపీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డిలు హడావిడిగా ప్రారంభోత్సవాలు చేశారు. మండల ప్రజాప్రజాపరిషత్ కార్యాలయాల ఆవరణలోనే డ్వాక్రా మహిళలకు సంబంధించిన వైఎస్‌ఆర్ ఆసరా 4వ విడత కార్యక్రమం వెలుగుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డిలతో పాటు పలువురు అధికారులు హజరయ్యారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే, ఎంపీలు మాట్లాడుతుండగానే మహిళలు తదితరులు మెల్లగా జారుకున్నారు. ఇదిలా ఉండగా సభకు వచ్చిన వారికి రైల్వేకోడూరు ఎంఈవో కార్యాలయం ఎదురుగా వంట చేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతో పలు విమ ర్శ లకు దారితీసింది. పనులు పూర్తయిన భవనాలకు ప్రారంభోత్సవాలు ఆరు నెలల కిందట చేయాల్సి ఉండగా.. ఎన్నికల వేళ ప్రజల్ని తప్పుదోవ పట్టించడానికి ప్రారంభోత్సవాలు చేశారని చర్చించుకోవడం కొసమెరుపు.

డుమ్మా కొట్టిన పలువురు సర్పంచులు

4వ విడత వైఎస్‌ఆర్ ఆసరా కార్యక్రమానికి నియోజకవర్గంలోని పలువురు సర్పంచులు డుమ్మా కొట్టారు. నాలుగున్నర సంవత్సరాలుగా తమకు ఎలాంటి పనులు జరగలేదని, చేసిన పనులకు బిల్లులు రాలేదని తీవ్ర సంతృప్తితో ఉన్నారు. దీంతో నియోజకవర్గంలోని చాలా మంది సర్పంచులు ఎమ్మెల్యే, ఎంపీ నిర్వహించిన సభకు డుమ్మా కొట్టారు. కాగా, కార్యక్రమాన్ని చిత్రీకరించడానికి వెళ్లిన ఓ చానల్ విలేఖరిపై వైసీపీ కార్యకర్తలు దాడికి దిగి ఫోన్ లాక్కున్నారు. దీన్ని ఉమ్మడి కడప జిల్లా జర్నలిస్టుల సంఘంతో పాటు పలువురు తీవ్రంగా ఖండించారు.

శ్రీసాయి హాస్పిటల్ ప్రారంభం


శ్రీసాయి హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్ ఆకేపాటి, ఎమ్మెల్యే మేడా, చిత్రంలో డాక్టర్లు జగన్‌మోహన్, అనురాధ

రాజంపేట, ఫిబ్రవరి 16: రాజంపేట పట్టణం బైపాసు రోడ్డులో డాక్టర్ జగన్‌మోహన్, డాక్టర్ అనురాధల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీసాయి హాస్పిటల్‌ను శుక్రవారం జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట పట్టణంలోని ఇంత అధునాతన పరికరాలతో హాస్పిటల్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందని, ఈ హాస్పిటల్ రాజంపేట పట్టణ పరిసర ప్రాంత ప్రజలకు అందరికీ శుభసూచికమన్నారు. కార్యక్రమంలో శ్రీసాయి గణేష్ మెడికల్స్ కొండూరు సుబ్బరామరాజు, పట్టణంలోని డాక్టర్లు శ్రీహరి, హరికృష్ణ, హరి గోపాల్, బాలరాజు, వీరయ్య, సుబ్బారెడ్డి, దినేష్, ప్రసన్న, విజయకుమార్, ప్రముఖ కాంట్రాక్టర్ చలమల వేణుగోపాల్‌రెడ్డి తదితర డాక్టర్లు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి



రైల్వేకోడూరులో ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 16: రైతు, కార్మికుల వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న నరేంద్రమోదీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధా క్రిష్ణయ్య, జిల్లా రైతు సంఘం నాయకుడు మలిశెట్టి రాహుల్‌లు పేర్కొన్నారు. శుక్రవారం రైల్వేకోడూరులో భారత్ బంద్ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మి వేస్తూ దేశానికి తీవ్ర నష్టం కల్గిస్తోందన్నారు. రైతులు పండించే పంటలకు కనీసం గిట్టుబాటు ధరలు కూడా కల్పించడం లేదన్నారు. రైల్వేకోడూరులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రసం గించారు. సీపీఐ, సీఐటీయూ, బీకేయంయూ, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై..

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై కార్మిక సంఘాలు బంద్ నిర్వహించాయి. శుక్రవారం మండల కేంద్రంలో ఎస్‌బీఐ ఎదురుగా బీకేఎంయూ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ ఆధ్వ ర్యంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా సంఘాల నాయకులు కె.నరసయ్య, కె.యానాదయ్యలు మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా మోసగిస్తోందన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, బ్యాంకులు, ఎల్‌ఐసీ తదితర సంస్థలన్నింటినీ ఆదాని, అంబానీ తదితర కార్పొరేట్ కంపెనీలకు అప్పగించి నాలుగు కార్మిక కోడ్‌లను తెచ్చిందన్నారు. స్వామినాధ కమిటీ సిఫారసుల ప్రకారం అన్ని పంటలకు సీ2+50 శాతం ప్రకారం మద్దతు ధర చట్టం చేయాలన్నారు.

కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి

సంబేపల్లె, ఫిబ్రవరి 16: రైతు వ్యతిరేక నల్లచ ట్టాలు ప్రభుత్వం వెంట నే రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త గ్రామీణ పారిశ్రా మిక బంద్‌ను సంబేప ల్లెలో శుక్రవారం రైతు సంఘం, సీఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతు, కార్మిక వ్యతిరేక బడ్జెట్ అన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్‌లను వ్యవసాయ పంపుసెట్లకు బిగించడం విరమించుకోవాలన్నారు. రైతు సంఘం జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, సీఐ టీయూ నాయకులు అనసూయమ్మ, శ్రీలత, పర్వానా చాందినీ వెంక టసుబ్బ మ్మ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక కర్షక వ్యతిరేక విధానాలపై నిరసన


చిట్వేలిలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

చిట్వేలి, ఫిబ్రవరి 16: సీఐటీయూ వ్యవసాయ కార్మిక సంఘం ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఆధ్వ ర్యంలో కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా సీఐటీయూ నాయకులు శుక్రవా రం గ్రామీణ బంద్ ను చేపట్టారు. ఈ మేరకు వైఎస్సార్ సర్కిల్ నుంచి కొత్త బస్టాండు వరకు ర్యాలీలో కరపత్రాలు పంపిణీ చేసిన నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పందికాళ్ల మణి, సీఐటీయూ మండల కార్యదర్శి యదురూరి సుజాత తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డికి సంబంధించిన నిజాలన్నీ రాజధాని సినిమాలో ఉన్నాయి...

● టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, ఫిబ్రవరి 16: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి సంబంధించిన అసలు నిజాలన్నీ రాజధాని ఫైల్స్ సినిమాలో ఉన్నాయని టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. శుక్రవారం రాజంపేట పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అమరావతి రాజధాని ఫైల్స్ సినిమాతో వైసీపీ ప్రభుత్వానికి వెన్నులో వణుకు పుట్టిందన్నారు. రైతుల బతుకు చిత్రంపై తీసిన సినిమాను అడ్డుకునే నీచస్థితికి జగన్‌రెడ్డి దిగారని, ఒక సినిమాను చూసి ముఖ్యమంత్రి భయపడటం ఇదే తొలిసారి అన్నారు. ఈ సినిమా అమరావతి రైతుల త్యాగాలకు వాస్తవరూపమన్నారు. సామాజిక బాధ్యతతో సినిమా తీస్తే జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చిన నష్టం ఏంటని ఆయన ప్రశ్నించారు. అమరావతిలో 33వేల రైతుల త్యాగాలను బూడిదపాలు చేసి రాష్ట్ర ప్రజల కోసం తీసిన సినిమాను ముఖ్యమంత్రి అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, పార్లమెంటు కార్య నిర్వాహక కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సతీష్‌రాజు, సీనియర్ నాయకులు కోటయ్య నాయుడు, ఎంపీటీసీ సురేష్, తోట శివశంకర్, నాగేంద్ర, తులసి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసిన యువతకు సర్టిఫికెట్లు అందజేత

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశా లలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలరింగ్ శిక్షణ నిర్వహించారు. శుక్ర వారం శిక్షణ పూర్తి చేసుకున్న యువతీ యువకులకు నేషనల్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ద్వారా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ మాటా్లడుతూ శిక్షణ పొందిన యువతీ యువకులు ఉద్యోగాల్లో చేరి కుటుంబాలకు ఆసరగా నిలబడాలని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ, కోఆర్డినేటర్ మధుసూదన్‌రెడ్డి, మహమ్మదరఫీ, గణేశ్‌లు పాల్గొన్నారు.

నూతన ఆర్జేడీని కలిసిన ఎస్టీయూ నేతలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 16: కడప డీఈవోగా పనిచేస్తూ ఆర్జేడీగా పదోన్నతి పొంది ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన రాఘవరెడ్డిని శుక్రవారం అన్నమయ్య జిల్లా ఎస్టీయూ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శుభా కాంక్షలు తెలియజేశారు. ఎస్టీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు అంకం శివారెడ్డి, సీనియర్ నాయకులు ఆదినాయణరెడ్డి, రవీంద్రనాధ్ రెడ్డి, తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

అచ్చెన్నాయుడును కలిసిన మండిపల్లి



రాయచోటిటౌన్, ఫిబ్రవరి 16: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడును శుక్రవారం ఆయన స్వగృహంలో రాయచోటి నియోజకవర్గ టీడీపీ నేత మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాలతో సన్మానించారు. అనంతరం రాయచోటి నియోజ కవర్గంలో పార్టీ స్థితిగతులపై చర్చించారు.

ప్రధానమంత్రి ఆదర్శ పథకం కింద 38 దళిత గ్రామాల ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 16: ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ పథకం కింద జిల్లాలో 38 దళిత గ్రామాలను కేంద్రప్రభుత్వం ఎంపిక చేసినట్లు జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గ్రామ జనాభాలో 50 శాతానికిపైగా దళితులుండే గ్రామాలను ఎంపిక చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతారన్నారు. శుక్రవారం తన చాంబర్‌లో జరిగిన సమావేశంలో ఆయన అధికారులతో మాట్లాడారు. 2023-24లో తాగునీరు, విద్య, వైద్యం, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పన, యువతకు ఉపాధి ఇచ్చి ఆర్థిక స్వావలంబన కల్పన కోసం రూ.21లక్షలు వంతున ఈ ఆదర్శ గ్రామాలకు విడుదలవుతాయన్నారు. ఈ పథకాన్ని జిల్లాలో రెండు దశలుగా అమలుచేయనున్నట్లు వెల్లడించారు. గ్రామాలవారీగా ప్లాన్లను తయారుచేసి ఆమోదం పొందాక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, బీపీఆర్సీ కోఆర్డినేటర్ షణ్ముగరామ్, జడ్పీ ఏవోలు లోకేష్, రెడ్డిబాబు, పి.గౌరి, సురేంద్ర బాబు, నాగమణి, ఇతర అధికారులు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

● అంతకుముందు ఆడిట్ అధికారులతో సమావేశమైన సీఈవో.. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆడిట్‌కు అన్ని రికార్డులు, ఫైల్స్ సిద్ధం చేయాలని జడ్పీ అధికారులను సూచించారు. స్టేట్ ఆడిట్ ఏఏవో ఏజీ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి ఖజానా శాఖ ఉద్యోగులకు మినహాయింపు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 16: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల విధుల నుంచి ఖజానా శాఖ ఉద్యోగులకు గతంలోలాగే మినహాయింపు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని అదనపు రాష్ట్ర ఎన్నికల అధికారి కోటేశ్వరరావు కలెక్టర్‌కు ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల విధుల కోసం ఉపాధ్యాయులు సహా 71 ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న అన్ని కేడర్ల ఉద్యోగులకు సంబంధించి ఫొటో ఓటరు, గుర్తింపు కార్డు వివరాలు సేకరించే ప్రక్రియ వారం రోజుల పాటు కలెక్టరేట్‌లో జరిగింది. ఇందులో సమాచార, ఖజానా, పే అండ్ అకౌంట్స్, వాణిజ్య తదితర శాఖల ఉద్యోగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఉంటుంది. ఇటీవల ఈ శాఖల ద్వారా కూడా ఉద్యోగుల వివరాల సేకరణ జరిగింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఖజానాశాఖ ఉద్యోగుల సంఘ నాయకులు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులను కలిసి ఎన్నికల విధుల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. దీంతో ఖజానా ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చే విషయాన్ని పరిశీలించాలని కలెక్టర్‌కు సూచించింది.

సెకండ్ స్పెల్ ప్రాక్టికల్స్ ప్రారంభం

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 16: జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈనెల 11న ప్రాక్టికల్స్ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈనెల 20వ తేదీ వరకు కొనసాగే ఈ ప్రక్రియలో భాగంగా శుక్రవారం నుంచి సెకండ్ స్పెల్ ప్రాక్టికల్స్ ప్రారంభమైనట్లు డీవీఈవో సయ్యద్ మౌల తెలిపారు. జిల్లావ్యాప్తంగా 22 కేంద్రాల్లో జరిగే ఈ ప్రాక్టికల్స్‌లో 836 మంది విద్యార్థులకు గాను 806 మంది హాజరుకాగా, 30 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు దయానందరాజు, బాలసుబ్రమణ్యం, మురళీకృష్ణ, స్క్వాడ్ మెంబరు హేమలత ఆధ్వర్యంలో ప్రాక్టికల్స్ జరుగుతున్నాయి. ఈ నెల 23న మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులకు పర్యావరణ విద్య పరీక్ష జరుగుతుందని డీవీఈవో తెలిపారు.

ఎస్‌బీ డీఎస్పీగా సుధాకర్‌రెడ్డి



చిత్తూరు, ఫిబ్రవరి 16: జిల్లా స్పెషల్‌బ్రాంచి డీఎస్పీగా ఎన్.సుధాకర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన చిత్తూరులో ఎస్‌ఐగా, సీఐగా, డీఎస్పీగా పనిచేశారు. అనంతరం పలమనేరు డీఎస్పీగా బదిలీ అయిన ఆయన.. ఇటీవల ఎన్నికల నిబంధనల్లో భాగంగా నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు బదిలీ కాగా తిరిగి ఎస్‌బీ డీఎస్పీగా చిత్తూరుకు వచ్చారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి పెట్టండి

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 16: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు అధికారులను కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన రెవెన్యూ, పోలీసు అధికారులతో ఎన్నికలకు సంబంధించి కమ్యూనికేషన్ ప్లాన్ తదితర అంశాలపై సమీక్షించారు. అన్ని పోలింగ్ కేంద్రాలను రెవెన్యూ అధికారులు పరిశీలించి వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. 1266 లోకేషన్లలో 1762 పోలింగ్ కేంద్రాలున్నాయని, వాటికి నెట్వర్క్ వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులు, ఏఎస్పీ అరీఫుల్లా, కుప్పం, పలమనేరు ఆర్డీవోలు శ్రీనివాసులు, మనోజ్‌రెడ్డి, డ్వామా పీడీ రాజశేఖర్, చిత్తూరు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్ రెడ్డి, ఇతర రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టం కింద 25 శాతం ఉచిత ప్రవేశాలు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 16: వచ్చే విద్యాసంవత్సరంలో జిల్లాలోని అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం కింద 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించనున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న అనాధ పిల్లలు, హెచ్‌ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగుల కోసం 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాల (బీసీ, మైనారిటీ, ఓసీ) పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షికాదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలు కలిగిన వారి పిల్లలు ఉచిత నిర్బంధ విద్య హక్కు చట్టానికి అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో ఈనెల 23 నుంచి మార్చి 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మొదటి విడత ఎంపిక జాబితా ఏప్రిల్ ఒకటిన, రెండో విడత జాబితా ఏప్రిల్ 15న విడుదల చేయనున్నట్లు తెలిపారు.

రేపు కాణిపాకంలో కళా నైవేద్యం

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 16: కాణిపాకంలో ఆదివారం కళా నైవేద్యం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు, జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళి శుక్రవారం తెలిపారు. అగరంపల్లె ఆర్చి నుంచి ఆలయం వరకు సుమారు నాలుగు వేల మంది కళాకారులతో కోలాటాలు, చెక్క భజనలు, కులుకు భజన, పిల్లనగ్రోవులు, భజన బృందాలు, బుర్రకథ, కూచిపూడి, భరత నాట్యం, వీధి నాటకం కళాకారులు పాల్గొంటారన్నారు.

నిరసన ప్రదర్శనలతో 'భారత్ బంద్'



గాంధీ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శనలు చేస్తున్న కార్మిక, రైతు, ప్రజా సంఘాల నేతలు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రైతు, కార్మిక వర్గం శుక్రవారం చేపట్టిన భారత్ బంద్.. నిరసన ప్రదర్శనలతో ముగిసింది. దుకాణాలు, కార్యాలయాలు యథావిధిగా పనిచేశాయి. బస్సులు, ఆటోలు తిరిగాయి. రైతు, కార్మిక సంఘాల నేతలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చిత్తూరులో నిరసన ప్రదర్శనగా గాంధీ విగ్రహం వద్దకు చేరిన నేతలు.. కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మోదీ ప్రభుత్వం తుంగలో తొక్కడమే కాక రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని విమర్శించారు. కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండు చేశారు. ఉపాధి హామీ పథకానికి రూ.2 లక్షల కోట్లు కేటాయిస్తూ 200 రోజులు పని కల్పించాలన్నారు. ఆహార భద్రత చట్టాన్ని పటిష్ఠం చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలన్నారు. ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు నాగరాజు, సురేంద్రన్, చైతన్య, సురేష్, దొరస్వామి, జయశంకర్, సుగుణ తదితరులు పాల్గొన్నారు.



కనులపండువగా రథసప్తమి వేడుకలు

కిటకిటలాడిన తిరుమల మాడవీధులు

సప్త వాహన సౌందర్యం

తిరుమల, ఆంధ్రజ్యోతి

మలయప్ప స్వామి సప్త వాహన సేవల ఊరేగింపులతో తిరుమల గిరులు పులకించిపోయాయి. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణలు, కర్పూర హారతులు, భజన బృందాల ప్రదర్శనలతో మాడవీధులు మార్మోగాయి.శుక్రవారం ఉదయం 5.30గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగిన వాహనసేవలను అశేష సంఖ్యలో భక్తులు దర్శించి తరించారు.ఎముకలు కొరికే చలిని సైతం లెక్కచేయకుండా 24గంటల పాటు గ్యాలరీల్లోనే ఉండి శ్రీనివాసుడి దర్శన భాగ్యంతో ఆనందపరవశులయ్యారు. సూర్యప్రభ వాహనసేవ సందర్భంగా శ్రీవేంకటేశ్వర బాలమందిరం విద్యార్థులు ఆలపించిన 'ఆదిత్యహృదయం', 'సూర్యాష్టకం' సంస్కృత శ్లోకాలు భక్తుల మనసుదోచాయి. వాహనసేవల్లో హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాదాపు 900మంది కళాకారులు పాల్గొన్నారు. కోలాటం, లెజిమ్స్, దీపనృత్యం, కేరళ-ఓనం నృత్యం, జానపద నృత్యం, గోపికా నృత్యం, హారతి నృత్యం, అన్నమయ్య విన్నపాల నృత్యం, రాజస్థాన్-దాండియా నృత్యం, పుదుచ్చేరి-కరగాట్టం ,మోహినీ అట్టం, తెలంగాణ-గర్బ నృత్యం, బిందెల నృత్యం, కూచిపూడి నృనత్యం, మహారాష్ట్ర లావణి నృత్యం, అసోం-భియ నృత్యం, బెంగాలీ నృత్యాలను అద్భుతంగా ప్రదర్శించారు.



మాడవీధులను వీడని భక్తులు

రథసప్తమి వేడుకలను తిలకించడానికి గురువారం సాయంత్రం నుంచే భక్తులు గ్యాలరీల్లోకి చేరుకోవడం మొదలుపెట్టారు.సాధారణంగా సూర్యప్రభ వాహనం నుంచి చక్రస్నానం వరకు భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. తర్వాత నెమ్మదిగా తగ్గుతుంది. అయితే ఈసారి మాత్రం భక్తులు ఎక్కడి వారు అక్కడే కూర్చుండిపోయారు. రాత్రి 9 గంటల వరకు గ్యాలరీల్లోనే ఉండి వాహనసేవలన్నీ వీక్షించారు. అయితే ఎక్కడి నుంచి గ్యాలరీల్లోకి ప్రవేశించాలనే సమాచారం తెలియక చాలామంది ఇబ్బంది పడ్డారు.భక్తులతో కొన్నిచోట్ల భద్రతా సిబ్బంది దురుసుగా ప్రవర్తించడం, రాంభగీచ వద్ద తీవ్రస్థాయిలో నెట్టడం విమర్శలకు దారితీసింది.





గరుడ, హనుమంత వాహనాలపై నారాయణుడు

ఏడు వాహనాలపై నారాయణుడు



సూర్యప్రభ వాహనంపై స్వామివారికి హారతి

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 16: రథసప్తమి సందర్భంగా గంగాధరనెల్లూరు మండలం వేపంజేరిలోని లక్ష్మీనారాయణస్వామి శుక్రవారం ఏడు వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. నారాయణుడి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో అర్చకులు పూజాకార్యక్రమాలు నిర్వహించాక సూర్యప్రభ, శేష, అశ్వ, హంస, గరుడ, హనుమంత, చంద్రప్రభ వాహనాలపై నారాయణుడి ఉత్సవమూర్తిని అధిష్ఠింపజేసి భక్తులకు దర్శన భాగ్యం కల్గించారు. కాగా, వేపంజేరిలో ఓవ్యక్తి మరణించడంతో పురవీధుల్లో వాహనసేవలను రద్దుచేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఏడు వాహనాలపై స్వామివారిని అధిష్ఠింపజేయగా, కల్యాణ మండపంలోనే భక్తులు దర్శించుకున్నారు. తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి రాంబాబురెడ్డి దంపతులు, మాజీ సర్పంచ్ పెద్దారెడ్డి (వరదరాజులురెడ్డి), ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, చెన్నైకి చెందిన యోగా మాస్టర్ భాస్కర్, భక్తులు పాల్గొన్నారు.

దొంగ ఓటర్ల వలసను అరికట్టండి

● జేసీ శ్రీనివాసులుకు టీడీపీ నాయకుల వినతి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 16: 'ఇతర మండలాల నుంచి వలస దొంగ ఓటర్లను వైసీపీ నాయకులు ఓటర్ల జాబితాలో చేరుస్తున్నారు. వాటిపై కన్నేసి అలాంటి పేర్లను తొలగించండి' అని జేసీ శ్రీనివాసులును తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జేసీని కలిసి వినతిపత్రం అందజేశారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో గంగాధరనెల్లూరు, శ్రీరంగరాజపురం మండలాల నుంచి ఫారం-6 ద్వారా 429, ఫారం-7 ద్వారా 334, ఫారం-8 ద్వారా 725 వెరసి 1488 దొంగ ఓటర్లను స్థానిక వైసీపీ నాయకులు దొడ్డిదోవన చేర్పేందుకు దరఖాస్తులు అందజేశారని ఆరోపించారు. ఈ మేరకు సాక్ష్యాలను చూపుతూ జేసీకి పలు పత్రాలను అందజేశారు. వీటిపై తగిన విచారణ జరిపి దొడ్డిదోవన వచ్చిన దరఖాస్తులను రద్దుచేసి స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారు చేయాలని కోరారు. టీడీపీ నాయకులు ఇచ్చిన సాక్ష్యాధారాలను పరిశీలించిన జేసీ.. వీటిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కఠారి హేమలత, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఆర్ రాజన్, చిత్తూరు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రాజశేఖర్, అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు ఇన్‌చార్జి డీఎస్పీపై

విచారణ జరిపి నివేదిక ఇవ్వండి

● బీసీవై పార్టీ అధినేత ఫిర్యాదుపై కలెక్టర్‌కు ఎన్నికల ప్రధానాధికారి ఆదేశం



డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

పుంగనూరు, జనవరి 16: ఎన్నికల ప్రవర్తనా నియమావళి రాకముందే పుంగనూరులో పలమనేరు ఇన్‌చార్జిగా ఉన్న చిత్తూరు టౌన్ డీఎస్పీ ఎం.రాజగోపాల్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారించి నివేదిక పంపాలని కలెక్టర్‌ను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనా ఆదేశించారు. ఈనెల 6వ తేది పుంగనూరు కొత్త ఇండ్లు ఎల్‌ఐసీ కాలనీ, చదళ్ల సమీపంలోని తిమ్మికృష్ణాపురంలో బీసీవై పార్టీకి చెందిన గోడగడియారాలు పెద్దఎత్తున ఉన్నాయని, సోదాలు చేయడానికి పోలీసులు రంగం సిద్ధం చేశారు. ఈ తనిఖీలకు పలమనేరు ఇన్‌చార్జి డీఎస్పీగా రాజగోపాల్ రెడ్డి సెర్చ్‌వారెంట్ ఇచ్చారు. పోలీసు బలగాలు తనిఖీలు చేసి గోడ గడియారాలను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. 'మంత్రి ఆదేశాలతో పోలీసులు గోడ గడియారాల్లో నిషేధిత వస్తువులు పెడతారన్న అనుమానాలతో అందరి సమక్షంలో వీడియో రికార్డులతో పంచనామా చేయాలని చెప్పాం. గడియారాలకు సంబంధించి అన్ని రకాల బిల్లులు చూపిం చూపించినా పోలీసులు పట్టించుకోలేదు. మరుసటి రోజు గడియారాల బాక్సుల్లో కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లు ఉన్నాయని నాపైన.. తిమ్మికృష్ణాపురంలో ఇంటి యజమాని శివకుమార్‌పై కేసులు నమోదు చేశారు. శివకుమార్‌ను అరెస్టు చేశారు' అంటూ పలు ఆధారాలను చూపుతూ ఎన్నికల సంఘానికి రామచంద్రయాదవ్ ఫిర్యాదు చేశారు. దీనిపై సీఈవో ముఖేశ్‌కుమార్ మీనా స్పందించి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలంటూ కలెక్టర్‌ను ఆదేశించారు.

రాష్ట్రపతి భవన్ నుంచి సీఎస్‌కు..

పుంగనూరులో కొందరు అధికారులు వైసీపీకి తొత్తులుగా వ్యవహరిస్తూ రాజ్యాంగాన్ని అమలు చేయకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని రాష్ట్రపతికి రామచంద్రయాదవ్ ఫిర్యాదు చేశారు. దీనిపైనా విచారించి నివేదిక పంపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని రాష్ట్రపతి భవన్ సెక్రటరీ పీపీ.మీనా ఆదేశించారు. కాగా, పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తొత్తులుగా పనిచేస్తూ తప్పులు చేస్తున్న అధికారులకు శిక్ష తప్పదని ఒక ప్రకటనలో రామచంద్రయాదవ్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి

● చంపేసి చెరువులో పడేశారని ఆరోపణ


బాలిక మృతదేహం

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 16: అనుమానాస్పద స్థితిలో ఓ బాలిక (15) చెరువులో శవమై తేలింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు... తంబళ్లపల్లె మండలం కోట కొండకు చెందిన ఎం.అంజినప్ప, రెడ్డెమ్మ దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వీరిలో రెండో అమ్మాయి స్వాతి 9వ తరగతి వరకు చదివి తల్లితో పాటు ఇంటి పట్టునే ఉంటుంది. .. తండ్రి భిక్షాటన చేస్తుంటాడు. గురువారం తెల్లవారుజామున నిద్ర లేచిన రెడ్డమ్మ ఇంట్లో స్వాతి కనిపించకపోవడంతో గ్రా మంలో, బంధువుల ఇళ్లలో గాలించారు. ఆమాకీ లభ్యం కాకపోవడంతో సాయంత్రం తంబళ్లపల్లె పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. వెంటనే బాలిక సెల్‌ఫోన్ లొకేషన్‌ను ట్రేస్ చేసిన పోలీసులు కోటకొండ చెరువులో ఉన్నట్లు గుర్తించారు. దీంతో తల్లితండ్రులు, కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లి గాలించగా చెరువు ఒడ్డున బాలిక చెప్పులు, సెల్‌ఫోన్ కనిపించాయి. సెల్‌ఫోన్ దొరికిన ప్రదేశానికి కొద్ది దూరంలో నీటిలో బాలిక మృతదేహం తేలియాడుతూ ఉండటం గుర్తించారు. వారు అందించిన సమాచారం మేరకు హెడ్‌కానిస్టేబుల్ శంకర, సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. బాలిక శరీరం వెనుకవైపు కొట్టినట్లు అరచేతి గుర్తులు ఉన్నాయిని, బాలిక పాదాలు, మోకాళ్లు, అరిచేతులకు మట్టి అంటిఉందని కుటుంబసభ్యులు చెబుతున్నారు. తమ బిడ్డను ఎవరో చంపేసి తీసుకొచ్చి చెరువులో పడేసి ఉంటారని బాలిక తల్లితండ్రులు, కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 16: మతిస్థిమితం లేక ఆత్మహత్యకు యత్నించిన మహిళ శుక్రవారం మృతి చెందింది. మదనపల్లె పట్టణం బుగ్గవంక ప్రాంతానికి చెందిన కృష్ణ భార్య అనసూయమ్మ(65) గత కొన్నేళ్లుగా మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తోంది. ఈనెల 12న ఇంటిలోని పురుగుల మందు తాగేసింది. గమనించిన కుటుంబీకులు ఆమెను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు ఐసీయూలో పెట్టి చికిత్సలు అందిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఆమె పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చింతకాయల కోసం వెళితే చెయ్యి విరగ్గొట్టాడు


గాయపడ్డ ధనలక్ష్మి

ములకలచెరువు, ఫిబ్రవరి 16: చింతకాయల కోసం వెళ్లిన ఓ మహిళ చెయ్యి విరగొట్టిన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని మద్దినాయనిపల్లె పంచాయతీ ఎర్రంరెడ్డిగారిపల్లెకు చెందిన వెంకటరమణ భార్య ధనలక్ష్మి(28) దాసిరెడ్డిగారిపల్లెలోని ఓ చింత చెట్టు కింద రాలిన చింతకాయలు ఏరుకుంటుండగా గ్రామానికి చెందిన తులసిరెడ్డి అనే వ్యక్తి తన పొలంలోని చింత చెట్టు కింద కాయలు ఏరుకుంటావా అని కర్రతో దాడి చేయడంతో ఆమె చెయ్యి విరిగింది. కుటుంబ సభ్యులు ఆమెను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ నజీర్‌బాషా తెలిపారు.

విద్యార్థి అదృశ్యం.. కేసు నమోదు


సుహేల్

ములకలచెరువు, ఫిబ్రవరి 16: బాలుడి అదృశ్యంపై కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. సత్యసాయి జిల్లా తనకల్లు మండలం బొంతలపల్లెకు చెందిన బాబాఫక్రుద్దీన్ కుమారుడు సుహేల్(12) ములకలచెరువులో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు. గురువారం పాఠశాలకు వెళ్ళిన తన కుమారుడు సాయంత్రం ఇంటికి తిరిగిరాకపోవడంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిమ్మనపల్లి తహసీల్దార్‌గా బాలాజిరాజు



నిమ్మనపల్లి, ఫిబ్రవరి 16: నిమ్మనపల్లి తహసీల్దార్‌గా ఆర్. బాలాజిరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో ఏవోగా పని చేస్తున్న బదిలీపై నిమ్మనపల్లి తహసీల్దారుగా వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన మంజుల పదవీ విరమణ చేశారు. అనంతరం బాలాజిరాజు మాట్లాడుతూ ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు.

కలకడ తహశీల్దార్‌గా ప్రియదర్శిని



కలకడ, ఫిబ్రవరి 16:కలకడ మండల తహశీల్దార్‌గా ప్రియదర్శిని శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఈమె నంద్యాల ఆర్డీవో కార్యాలయం ఏవోగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. కాగా ఇక్కడ తహశీల్దార్‌గా పని చేసిన ప్రదీప్ అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు.

నేడు సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 16: పట్టణ శివార్లలోని ధర్మపథం సమూహాలయంలో శనివారం ఉదయం షిరిడీ సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం నిర్వహిసున్నామని, భక్తులు ముందస్తు రుసుము చెల్లించి ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చునని అర్చకుడు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు తెలిపారు. వేడుకల అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని వివరించారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి


రెడ్డిఅజయ్ (ఫైల్‌ఫోటో)

రామసముద్రం, ఫిబ్రవరి 16: ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బల్లర పల్లెకు చెందిన నారప్ప కుమారుడు రెడ్డి అజయ్(19) శుక్రవారం ద్విచక్ర వాహనంపై కేసీపల్లెకు వెళ్లి తిరిగి వస్తుండగా ఉప్పినెల్లి వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పుంగనూరు ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.


పీలేరు: ప్రత్యేక అలంకారంలో ఆండాళ్ సమేత వేంకటేశ్వర స్వామి


కలకడ: సూర్యభగవానుడికి పూజలు చేస్తున్న భక్తులు


వాల్మీకిపురంలో ఊరేగుతున్న సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడు

భక్తిశ్రద్ధలతో రథసప్తమి

వాల్మీకిపురం, ఫిబ్రవరి 16: వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో శుక్రవారం టీటీడీ ఆధ్వర్యంలో రథసప్తమి పండుగ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. రథసప్తమి సందర్భంగా భోగోత్సవ మూర్తులైన సీతారామ లక్ష్మణులకు విశేష అలంకరణలతో తిరుచ్చిలో పట్టణ పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పురవీధులు శ్రీరామ నామ సర్మరణలతో మారుమ్రోగాయి. అనంతరం ఆలయంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పీలేరు: పట్టణంలోని శివాలయం, కోటపల్లెలోని పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం, వేంకటాద్రి ఇండ్ల వద్దనున్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు, స్వామి, అమ్మవార్లకు పల్లకి సేవ నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు విద్యార్థులతో సూర్యనమస్కారాలు చేయించారు. నెహ్రూ యువ కేంద్రం, పీలేరు పట్టణంలోని 'షీ' సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వీఎస్ఎన్ సిద్దార్థ, భువన విద్యాలయం, ఎస్‌జీ డిగ్రీ కళాశాలలో సామూహిక సూర్యనమస్కారాలు చేయించారు. ఈ సందర్భంగా 'షీ' సంస్థ అధ్యక్షురాలు పీవీఎల్ లక్ష్మీ మాట్లాడుతూ ప్రతిరోజూ వేకువజామున 12సార్లు సూర్యనమస్కారాలు చేయడం వల్ల సూర్యభగవానుడి అనుగ్రహం కలిగి శరీరం ఆరోగ్యవంతంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎస్‌జీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.సుధాకర్ రెడ్డి, వీఎస్ఎన్ సంస్థల అధినేత్రి మాధవి, భువన విద్యాలయం కరస్పాండెంట్ ఉమాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కలకడ: గోపాలపురం షిర్డిసాయిబాబా ఆలయం ముందు సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ఆలయాల్లో భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు.

పెద్దతిప్పసముద్రం: రథసప్తమి సందర్భంగా మండల కేంద్రంలోని పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం నుంచి పూజలు నిర్వహించారు. సనగరం పట్టాబిరామయ్య ఆధ్వర్యంలో పురుషోత్తం శర్మ, మణికంఠశర్మ అభిషేకాలు, అరుణా పారా యణం, అరుణ హోమం, రథానికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. అన్నదానం చేశారు.

ముస్లిం ద్రోహి..వైసీపీ

● మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 16: మదనపల్లెలో 300 ముస్లిం కుటుంబాలను వీధిపాలు చేసిన వైసీపీ ముస్లింల ద్రోహిగా మిగిలిపోయిందని మదనపల్లె టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా విమర్శించారు. శుక్రవారం స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిప్పు సుల్తాన్ మైదానంలోని పేద ముస్లింలకు చెందిన 300 షెడ్లను వైసీపీ నాయకులు కూల్చివేసి వారి కుటుంబాలను వీధిన పడేశారన్నారు. అదే మైదానంలో ఏర్పాటు చేసిన సభలో సీఎం జగన్ మాట్లాడుతూ మసీదుకు రూ.5 కోట్లు, మదనపల్లె పట్టణంలో ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.30 కోట్లు, అభివృద్ధి పనులకు రూ.30 కోట్లు ఇస్తామని మాట ఇచ్చారని, కాని ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు, 2014 నుంచి 19వ వరకు టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధి పనులపై తాము శ్వేతపత్రం ఇస్తామని, అదే వైసీపీ పాలనలో ఏం అభివృద్ధి చేశారో చెప్పగలిగే దమ్ముందా అని ప్రశ్నించారు. ముస్లిం మైనారిటీలు గుంటూరు ఇజ్తిమాకు వెళితే ఎంపీ మిథున్‌రెడ్డి బ్యానర్లు తగిలించి అసత్య ప్రచారం చేసుకున్నారన్నారు. ఆరు వేల ఉద్యోగాలకు మాత్రమే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. టీడీపీ, జనసేన పొత్తుతో రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను పారదోలి ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు కోట్లకు పడగలెత్తారని ఆరోపించారు. ఈ సమావేశంలో టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, షంషీర్, బాలుస్వామి, నవీన్‌చౌదరి, నాదెళ్ల శివన్న, హరి, గిరీష్, హసీనా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె గడ్డపై టీడీపీ జెండా ఎగరేద్దాం

● మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్


మాట్లాడుతున్న శంకర్‌యాదవ్

ములకలచెరువు, ఫిబ్రవరి 16: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తంబళ్లపల్లె నియోజకవరంలో టీడీపీ, జనసేనల జెండాలు ఎగరేద్దామని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జి.శంకర్‌యాదవ్ పిలుపు నిచ్చారు. మదనపల్లెలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాల ముఖ్య నాయకులతో ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి కార్యాచరణతో ముందుకెళ్దామన్నారు. ఎన్నికలకు రెండు నెలలే సమయం ఉన్నందున బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ పథకాలపై ముమ్మరంగా ప్రచారం నిర్వహించాలన్నారు. ఇంటింటికి వెళ్ళి టీడీపీ మేనిఫెస్టోను వివరిద్దామన్నారు. ఎన్నికలకోడ్ వచ్చే లోగా ఓటర్ వెరిఫికేషన్‌ను పూర్తి చేయాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అరాచక, అవినీతి వైసీపీ పాలనకు ప్రజలు త్వరలోనే స్వస్తి పలుకుతారన్నారు. అనంతరం వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలపై చర్చిం చారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, పోల్ కో ఆర్డినేటర్ కుడుం శ్రీనివాసులు, పీటీఎం, ములకలచెరువు మండలాల క్లస్టర్ ఇన్‌చార్జిలు శ్రీనాథరెడ్డి, చెన్నకిష్టా, యూనిట్ ఇన్‌చార్జిలు యల్లారెడ్డి, గుత్తా సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలు సమావేశాలు నిర్వహించ కూడదా..?


మాట్లాడుతున్న ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 16: రాష్ట్రంలో టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ బహిరంగ సమావేశాలకు అనుమతి ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం నిరంకుశ ధోరణిలో వ్యవహరిస్తోందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ భీమవరం పర్యటనకు వెళ్లేందుకు పవన్‌కళ్యాణ్ అన్ని ఏర్పాట్లు చేసుకుంటే ఆయన హెలికాప్టర్ దిగేందుకు అనుమతి లేదని ఆటంకం కల్పించారన్నారు. బాపట్లలో చంద్రబాబు బహిరంగ సభకు కూడా ఆటంకాలు సృష్టిస్తోందన్నారు. జగన్‌కు జేజేలు పలుకుతూ యాత్ర-2 సినిమా రిలీజ్ చేస్తే అందరికీ సెలవులివ్వాలని ప్రత్యేక జీవోలు జారీ చేసిన ప్రభుత్వం అమరావతి రాజధానిపై "రాజధాని ఫైల్స్" సినిమా రిలీజ్ చేస్తే మొదటి షో మధ్యలోనే హైకోర్టు ఆదేశాలంటూ రెవిన్యూ అధికారులు వెళ్లి థియేటర్లను మూయించారన్నారు. మదనపల్లెలో వైసీపీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా పదవిలో ఉండగానే, ప్రోటోకాల్‌ను పక్కన పెట్టి వైసీపీ సమన్వయకర్తతో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడం, ప్రజలను ఏమార్చడానికే అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజన్న, రామచంద్రనాయుడు, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగుల నిరసన


దూరవాణి కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు


ములకలచెరువు: పోస్టాఫీసు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 16: దేశవ్యాప్తం సమ్మెలో భాగంగా స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ఆసంస్థ ఉద్యోగులు శుక్ర వారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ అధ్యక్షుడు ఎల్. లక్ష్మీనారాయణ, కార్యదర్శి నాగయ్య మాట్లాడుతూ వేజ్, పెన్షన్ రివిజన్ వెంటనే పరిష్కరించాలని, స్టాగ్నేషన్, ప్రమోషన్ పాలసీల అమలు, బీఎస్ఎన్ఎల్‌లో 4జీ ,5జీ సర్వీసులను ప్రారంభించాలని డిమాం డ్ చేశారు. కాంట్రాక్టు పద్ధతిలో జరుగుతున్న దోపిడీని ఆపాలన్నారు. కార్యక్రమంలో నాయకు లు ఖలీల్, జోయాంజనీ, జయమ్మ, తిరుమల య్య ,వేణుగోపాల్, చిట్టిబాబు, అమరనాథ్, వి శ్రాంత ఉద్యోగులు వెంకటయ్య, వెంకటస్వామి, జయరామ్, నాగప్ప, శ్రీనివాసులు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువు: గ్రామీణ పారిశ్రామిక బంద్‌కు మద్దతుగా ములకలచెరువు పోస్టాఫీసు ఎదుట శుక్రవారం సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు నిర సన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై నినాదాలు చేశారు. సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప, పట్టణ కార్యదర్శి ఆనంద్, ఎఐటీయూసీ, నాయకులు మహబూబ్‌బాషా, సుబ్బన్న, వెంకటరమణ, జయకర్, చంద్ర, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూ ఇంజనీరింగ్ సెమిస్టర్ ఫలితాలు విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్

కలికిరి, ఫిబ్రవరి 16: కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల మొదటి సెమిస్టర్ ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. ఇటీవలే కలికిరి కళాశాలకు అటానమస్ అర్హత కలిగించడంతో స్థానిక కళాశాల యాజమాన్యమే స్వయంగా ఫలితాలను ప్రకటించే అవకాశం లభించింది. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ త్యాగరాజన్‌తో కలిసి ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ 51.66 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. కేవలం 15 రోజుల వ్యవధిలోనే మూల్యాం కనం పూర్తి చేసి ఫలితాలు విడుదల చేస్తున్నట్లు వివరించారు. ఈ ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపరిచామని, వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు ఫలితాలను చూసుకోవచ్చని వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ త్యాగరాజన్, అధ్యాపకులు ఆచార్య రంగజనార్ధన్ (మాజీ వీసీ), ఆచార్య కృష్ణయ్య (మాజీ రిజిస్ట్రారు), ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు ు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలి


పోలీసుఅధికారులకు సూచనలిస్తున్న జడ్జి జ్యోతి

వాల్మీకిపురం, ఫిబ్రవరి 16: స్థానిక కోర్టులో మార్చి 9న నిర్వహించనున్న మెగా జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి కృషి చేయాలని స్థానిక ఇన్‌చార్జి జడ్జి జ్యోతి సూచించారు. శుక్రవారం వాల్మీకిపురం, కలికిరి సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఏపీపీ శంకర్, సీఐ పులి శేఖర్, ఎస్ఐలు నాగేశ్వర్‌రావు, నాగార్జునరెడ్డి, షేక్‌షావలి, పోలీసు సిబ్బంది, మండల న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యవంత సమాజం కోసమే డీవార్మింగ్

పీలేరు, ఫిబ్రవరి 16: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రభుత్వం డీవార్మింగ్ ప్రక్రియను ఉధృతంగా నిర్వహిస్తోందని రాష్ట్రీయ బాలల సురక్ష జిల్లా అధికారి డా.శివప్రతాప్ తెలిపారు. జాతీయ నులిపురుగుల దినం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోని విద్యార్థులకు శుక్రవారం వాటిని అందజేశారు. స్థానిక కోటపల్లె జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ కౌమార దశలో బాలబాలికలు సంపూర్ణ పౌష్టికాహారం తీసుకోవాలని, నిర్దేశించిన దినాలలో ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, ఆల్బెండజోల్ మాత్రలు విధిగా తీసుకోవాలన్నారు. అనంతరం 370 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డా.చంద్రశేఖర్ నాయక్, హెచ్ఈ కొండయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

శివాంగ సాధకులకు పీలేరులో ఘనస్వాగతం

పీలేరు, ఫిబ్రవరి 16: కడప నుంచి కోయంబత్తూరుకు పాదయాత్ర చేస్తున్న శివ భక్తులకు వారికి శుక్రవారం వేకువన పీలేరు పట్టణానికి చెందిన ఆర్ఎస్ఎస్, ఇషా ఫౌండేషన్ సభ్యులు స్వాగతం పలికారు. అక్కడినుంచి ర్యాలీగా బ్రాహ్మణ వీధిలోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం అక్కడ 'శివాంగ స్ఫూర్తి' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజిత్ రెడ్డి, యుగంధర్, అమృతతేజ, చీపాటి వెంకట రమణా రెడ్డి, కాకులారం బాస్కరరెడ్డి, శశిధర్ రెడ్డి, వారణాశి మోహన్ రెడ్డి, రామ్మూర్తి, సుదర్శన్ రెడ్డి, ఆలయ అర్చకులు కుమార స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణను తొలగించండి సారూ...!

గుర్రంకొండ, ఫిబ్రవరి 16: పొలాలకు వెళ్లే దారిలో ఆక్రమణలను తొలగించండి సారూ అంటూ తలారివాండ్లపల్లె రైతులు శుక్రవారం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని కోరారు. గుర్రంకొండకు ఎమ్మెల్యే వస్తున్నట్లు తెలుసుకున్న రైతులు మజిగ్గవారిపల్లె క్రాస్ వద్ద ఆయన ప్రయాణిస్తున్న కారును ఆపారు. తమ పొలాల వద్దకు వెళ్లే దారిని ఓ రైతు ఆక్రమిం చుకొని ఇబ్బంది పెడుతున్నట్లు తెలిపారు. అక్కడే ఉన్న రెవెన్యూ సిబ్బందితో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

రమణీయం...శ్రీనివాసుడి రథోత్సవం

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 16: ప్రసన్న వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కోసువారిపల్లెలో శ్రీనివాసుడి రథోత్సవం రమణీయంగా సాగింది. స్వామి వారిని శుక్రవారం వేకువనే సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు పూర్తి చేశారు. అనంతరం సర్వాలంకార భూషితులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడిని రథంపై అధిష్టింపచేసి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి ఐశ్వర్యానికి ప్రతీక అయిన గజ వాహనంపై దేవదేవుడు కొలువు దీరి ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో నేటి ఉదయం శ్రీవారికి పల్లకి ఉత్సవం, సాయంత్రం అశ్వ వాహన సేవలు నిర్వహించనున్నారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్‌కుమార్, ఉపప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్ భట్టర్, అర్చకులు, రమేష్ స్వామి, సిబ్బంది నగేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ సాయినాథ్ గురువారం రాత్రి జనసేన, టీడీపీ నాయకులతో కలసి స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు

చంద్రబాబుతోనే సంక్షేమం


పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 16: నియోజకవర్గ ప్రజలందరు చల్లగా ఉండాలని, చంద్రబాబు సీఎం అయితేనే ఇది సాధ్యమని మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ తెలిపారు. శుక్రవారం రథసప్తమి సందర్భంగా స్థానిక ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆయన పూజలు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం దుర్భిక్షంలో కూరుకుపోయిందని, అవినీతి, నిరుద్యోగం, అరాచకాలు పెరిగిపోయాయన్నారు. వీటన్నింటిని రూపు మాపాలంటే చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షించారు. ఆయన వెంటన ఎస్ఎల్‌వీ రఘు, సాయిచిత్ర భాస్కర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం


మాట్లాడుతున్న రెడ్డిసాహెబ్

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 16: రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని మదనపల్లె నియోజకవర్గ నాయకుడు ఎస్‌రెడ్డిసాహెబ్ అన్నారు. శుక్రవారం అనంతపురంలో రాయలసీమ జిల్లాల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుల సమావేశంలో రెడ్డిసాహెబ్, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కేబాషా, రూరల్ పార్టీ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, నిమ్మనపల్లె మండలపార్టీ అధ్యక్షుడు ముబారక్‌ఖాన్, తంబళ్లపల్లె నియోజకవర్గ నాయకుడు చల్లానాని తదితరులు హాజరయ్యారు. రాష్ట్రంలో అక్రమాల ప్రభుత్వంతో విసిగి వేసారి పోయిన ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతున్నట్లు తెలిపారు.

అచ్చెన్నాయుడును కలసిన రాటకొండ విష్ణు


అచ్చెన్నాయుడుతో రాటకొండ విష్ణు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 16: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును మదనపల్లె మాజీ ఎమ్మెల్యే శోభ తనయుడు, తెలుగు యువత ఉపాధ్యక్షుడు రాటకొండ విష్ణువర్ధన్ మర్యాద పూర్వకంగా కలిసారు. శుక్రవారం అమరావతిలోని కార్యాలయానికి వెళ్లి మదనపల్లె నియోజకవర్గంలో టీడీపీ బలం, విజయావకాశాల తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాటకొండ సాగర్‌రెడ్డి, రాటకొండ శోభ ఎమ్మెల్యేలుగా టీడీపీ బలోపేతానికి కృషి చేశారన్నారు. ఈ సారి మదనపల్లె టీడీపీ టికెట్ తమ కుటుంబీకులకు ఇవ్వాలని కోరారు.

ఓపీఎస్ ఇచ్చే పార్టీకే మా ఓటు: యూటీఎఫ్

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 16: పాత పెన్షన్ విధానం సాధన కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని విస్తృతం చేస్తున్నట్లు ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ తెలిపారు. శుక్రవారం మదనపల్లె యూటీఎఫ్ కార్యాలయం వద్ద మన ఓటు మన భవిష్యత్ అనే నినాదంతో పోస్టర్ విడుదల చేశారు. అనంతరం పలు పాఠశాలలు, ముఖ్య ప్రదేశాల్లో కరపత్రాలను అంటించారు. సీపీఎస్, జీపీఎస్ కాకుండా ఓపీఎస్ మాత్రమే అమలు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించే వారికే రానున్న ఎన్నికల్లో ఉద్యోగ ఉపాధ్యాయ నిరుద్యోగుల ఓట్లు అనే విధానం పాటిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ డివిజన్ కన్వీనర్ సుధాకర్, మదనపల్లె మండల, పట్టణ అధ్యక్షుడు గాలిరవీంద్ర, భాను మూర్తి, శ్రీనప్ప, హరికృష్ణ, అంజప్ప, సురేంద్ర, హస్సన్‌బాష, జిలానీబాషా తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు క్యాష్ అవార్డులు


క్యాష్ అవార్డులు అందిస్తున్న ప్రసాదరావు, వెంకటరమణారెడ్డి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 16: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన ఆర్టీసీ ఉద్యోగులకు స్థానిక వన్ డిపో ఆధ్వర్యంలో శుక్రవారం క్యాష్ అవార్డులు అందించారు. ఈ సందర్భంగా జ్ఞానోదయ ప్రసాదరావు, వన డిపో మేనేజరు మూరే వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ డిపో అభివృద్ధి కోసం పని చేస్తే తగిన గుర్తింపు లభిస్తుం దన్నారు. ఎవరిపని వారు సక్రమంగా నిర్వహిస్తే అభివృద్ధి సాధ్యమవు తుందన్నారు. అసిస్టెంట్ మేనేజరు రేవతి, గ్యారేజ్ సూపర్‌వైజర్లు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదలను, రోగులను అదుకోవడం మన బాధ్యత


రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేస్తున్న సర్పంచ్ చలపతి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 16: నిరుపేదలను, రోగులను ఆదుకోవడం మన బాధ్యత అని కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి తెలిపారు. శుక్రవారం తన మనవడు లిఖిత్ జన్మదినం సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు, పండ్లతో పాటు, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి శశికుమార్, బోర్‌వెల్ సుధాకర్, కువైట్ మాధవరెడ్డి, ఆంజనేయకుమార్, బీఎస్‌వై అధ్యక్షుడు పునీత్, కుమార్ పాల్గొన్నారు.

కృష్ణదేవరాయలుకు జనసేన నివాళి


శ్రీకృష్ణదేవరాయలకు నివాళులర్పిస్తున్న గంగారపు రామ్‌దాస్‌చౌదరి, జంగాల శివరామ్

మదనపల్లె, ఫిబ్రవరి 16: శ్రీకృష్ణదేవరాయల జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి తదితరులు పుంగనూరురోడ్డులోని వైజంక్షన్‌లో ఉన్న విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీకృష్ణదేవరాయలు తిరుమల అభివృద్ధికి కృషి చేశారని, యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరామ్, నిమ్మనపల్లె మండల అధ్యక్షుడు ప్రదీప్‌సింగ్, తాళ్లగిరి, చంద్రశేఖర్, రూరల్ ప్రధాన కార్యదర్శి జంగాల గౌతమ్, జయ, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్స్ రంగానికి ఉజ్వల భవిష్యత్తు

కురబలకోట, ఫిబ్రవరి 16: శాస్త్ర,సాంకేతిక రంగాలు ఎంతో పురోభివృద్ధిని సాధిస్తున్న తరుణంలో ఎలక్ట్రానిక్స్ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉన్నదని ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలపారు. మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ తృతీయ సంవత్సరం విద్యార్థులు తిరుపతిలోని దూరదర్శన్ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి టెక్నాలజీపై అవగాహన కల్పించడంతో పాటుగా పోటీ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్ళను ఎలా అధిగమించాలో తెలియజేశారు.

లక్ష్మీజనార్దనస్వామి ఉత్సవాలకు అంకురార్పణ

రామసముద్రం, ఫిబ్రవరి 16: మండల కేంద్రంలోని లక్ష్మీజనార్దనస్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలకు అంకురార్పణ చేసిట్లు ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారథి భట్టార్, కులశేఖర్ భట్టార్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిరోజు ఒక్కో అవతారంలో స్వామివారు దర్శనమిస్తారు. ఈనెల 23న శుక్రవారం భూదేవి సమేత లక్ష్మీజనార్దనస్వామి కల్యాణోత్సవం, 24న శనివారం స్వామివారి బ్రహ్మరథోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అక్కగార్ల విగ్రహాల ప్రతిష్ఠ


పాలెంకురవపల్లెలో ప్రతిష్ఠించిన అక్క దేవతల విగ్రహాలు

కలికిరి, ఫిబ్రవరి 16: మండలంలోని పత్తేగడ పంచాయతీ పాలెంకురవ పల్లె శివారులో శుక్రవారం అక్కగార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. గ్రామానికి చెందిన మురళి మొక్కు చెల్లింపులో భాగంగా విగ్రహాలు సమర్పించారు. పూజారి బీరంగి తిమ్మయ్య ఆధ్వర్యంలో మూడు రోజులుగా పూజాదికాలు నిర్వహించి శుక్రవారం ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.